

ఫ్యాన్ చుట్టూనే

ఖాకీ..!

వైసీపీ సేవలోనే పోలీసులు





- ఇసుక అక్రమ రవాణాకు సహకారం
- స్టేషన్లలో నిత్యం సివిల్ పంచాయితీలు, సెటిల్‌మెంట్లు
- వైసీపీ నాయకులు పట్టుబడుతున్నా.. వదిలేస్తున్న వైనం
- అరెస్టులు చేయకుండా బెయిల్‌కు సహకారం



ఇటీవల పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లను రూరల్ పోలీసు స్టేషన్‌లో ఉంచిన దృశ్యం

ధర్మవరంరూరల్, ఆగస్టు 11: కూటమి ప్రభుత్వం కొలువుదీరి రెండు నెలలైనా కొందరు పోలీసులు.. వైసీపీ సేవలోనే తరిస్తున్నారన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. ధర్మవరంలో నేటికీ వైసీపీ రూలే నడుస్తోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వైసీపీ నాయకులకు అన్నివిధాలా సహకారం అందిస్తున్నట్లు కూటమి శ్రేణులు పేర్కొంటున్నాయి. పలుకేసుల్లో వైసీపీ నాయకులను స్టేషన్‌కు కూడా రప్పించకుండా కోర్టు నుంచి బెయిల్ తెచ్చుకునేలా పోలీసులు సహకారం అందిస్తున్నట్లు కూటమి నేతలు ఆరోపిస్తున్నారు. వైసీపీ నాయకులు ఇసుక అక్రమ రవాణాకు కూడా అడ్డుకట్ట వేయట్లేదు. వైసీపీ నాయకులు చెప్పినట్లే సివిల్ పంచాయితీలు, సెటిల్‌మెంట్లు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. వైసీపీ నాయకులను కాపాడుతున్నారని తెలుస్తోంది.

దాడులు, బెదిరింపులపై చర్యలు శూన్యం

గత వైసీపీ పాలనలో ఆ పార్టీ నాయకులు.. టీడీపీ వర్గీయులపై దాడులకు తెగబడ్డారు. ఫోన్లలో బెదిరించిన ఘటనలు కోకొల్లలు. వీటిపై బాధితులు.. పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేస్తే పట్టించుకున్న పాపాన పోలేదు. కొందరు పోలీసు అధికారులు హడావుడిగా కేసులు నమోదు చేస్తామని చెబుతున్నారే తప్ప.. గట్టి చర్యలు తీసుకోలేదన్న విమర్శలు లేకపోలేదు. అరెస్టులు చేయకుండా తూతూమంత్రంగా కేసులు కట్టి, స్టేషన్ బెయిల్ ఇచ్చేసి మళ్లీ వారే పంచాయితీలు పెట్టి ఫిర్యాదు వెనక్కి తీసుకునేలా చేశారనే ఆరోపణలున్నాయి. దాడులు చేసిన, బెదిరించిన వెంటనే ఆ నాయకులను అరెస్టుచేసి, రిమాండ్‌కు పంపితే వారి అరాచకాలకు అడ్డుకట్టపడేదని పలువురు పేర్కొంటున్నారు. ఇంకా వైసీపీ అధికారంలో ఉన్నట్లుగా ప్రస్తుతం పలువురు పోలీసులు వ్యవహరిస్తున్నట్లు కూటమి నేతలు ఆరోపిస్తున్నారు.

ఇంకా వైసీపీ సేవలోనే..

గత వైసీపీ ప్రభుత్వంలో పోస్టింగ్ తెచ్చుకున్న కొంత మంది పోలీసులు ఇంకా ఆ పార్టీ నాయకుల సేవలోనే తరిస్తున్నట్లు తెలుస్తోంది. వైసీపీ నాయకులు దాడులు చేసినా వారిపై కేసులు కట్టకుండా కాపాడారు. నేటికీ వైసీపీ నాయకులను మధ్యవర్తులుగా పెట్టుకుని సివిల్, కుటుంబ తగాదాలు పంచాయితీలు చేస్తుండడం గమనార్హం. అక్రమంగా ఇసుక తరలిస్తూ ట్రాక్టర్లు పట్టుబడినా.., ఇతర కేసుల్లో చిక్కినా వైసీపీ నాయకులు దర్జాగా ఫోన్లు చేసి, విడిపించుకుపోతున్నారన్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

బత్తలపల్లి, ధర్మవరం మండలాల్లోని పోతులనాగేపల్లి వంక నుంచి యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా సాగుతోంది. తుంపర్తి, పోతులనాగేపల్లి సమీప గ్రామాల్లోని చిత్రావతి వంక నుంచి వైసీపీ నాయకులు ఇసుక అక్రమంగా తరలిస్తూనే ఉన్నారు. పోలీసులు ఆమ్యామ్యాలు పుచ్చుకుని చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. వైసీపీ నాయకులతో గతంలో ఉన్న పరిచయాలతో వారి నుంచి ఫోన్లు రాగానే పోలీసులు మామూళ్లు పుచ్చుకుని, వదిలేస్తున్నట్లు తెలుస్తోంది. ఇతరుల ట్రాక్టర్లను మాత్రమే పట్టుకుని, జరిమానాలు వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఇటీవల పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లలో కొన్నింటికి మాత్రమే జరిమానా విధించి, మిగతా వాటిని మామూళ్లు పుచ్చుకుని వదిలేయడమే ఇందుకు నిదర్శనం. అదికూడా రెండు, మూడురోజులు ఇసుక ట్రాక్టర్లను స్టేషన్‌లో ఉంచుకుని, గుట్టుచప్పుడు కాకుండా ఆమ్యామ్యాలు పుచ్చుకుని, కేసులు నమోదు చేయకుండా వదిలేస్తున్నట్లు ఆ శాఖలో చర్చ సాగుతోంది.

నిత్యం సివిల్ పంచాయితీలు

సాధారణంగా సివిల్ పంచాయితీలకు సంబంధించి ముందుగా రెవిన్యూ అధికారులతో మాట్లాడి వారు ఇచ్చిన నివేదిక ఆధారంగా గొడవలు పడకుండా వారిపై చర్యలు తీసుకోవాల్సి ఉంది. ధర్మవరం రూరల్ పోతుకుంట, పట్టణ పోలీసుస్టేషన్లలో నిత్యం సివిల్ పంచాయితీల దందా నడుస్తోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వైసీపీ నాయకులకు సంబంధించి కేసులైతే పోలీసు స్టేషన్‌కు రాకుండానే వారు ఫోన్‌చేస్తే చాలు వెంటనే రెవెన్యూ అధికారులతో సంబంధం లేకుండా అవతలి వ్యక్తులను స్టేషన్‌కు పంచాయితీల కోసం పిలుస్తారన్న విమర్శలు మూటగట్టుకుంటున్నారు. వైసీపీ నాయకులు చెప్పినట్లు నడుచుకుంటూ.. అవతలి వ్యక్తులపై రుబాబు చేయడం, కేసులు నమోదు చేస్తామంటూ బెదిరించడం పరిపాటిగా మారింది. పట్టణంలో స్థలాల సమస్యలు, గ్రామాల్లో భూతగాదాల్లో పోలీసులు ఎక్కువగా తలదూర్చడంతో రెవెన్యూ అధికారులు సైతం విస్తుపోతున్నారు. ఎందుకింత అత్యుత్సాహం చూపుతున్నారనే వాదనలు జరిగినట్లు సమాచారం. గతంలో వైసీపీ నాయకులు చేసినా భూదందాల్లో నష్టపోయిన బాధితులు ఇటీవల పోలీసు స్టేషన్లను ఆశ్రయించారు. కొంతమంది కానిస్టేబుళ్లు వైసీపీ నాయకులతో మాట్లాడుకుని, 'సార్‌ను కలిస్తే కేసు కట్టకుండా చూసుకుంటామ'ని చెబుతున్నారట.



ధర్మవరం టూటౌన్ పోలీసు స్టేషన్

అరెస్టు చేయకుండా..

ఎన్నికల ముందు, తర్వాత జరిగిన గొడవలు, దాడుల్లో వైసీపీ నాయకులపైన కేసులు నమోదు చేసినా.. వారిని అరెస్టు చేయడంలో పోలీసులు తీవ్ర నిర్లక్ష్యం చూపుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ధర్మవరం పట్టణంలో టీడీపీ నాయకులపై ఎన్నికల సమయంలో వైసీపీ నాయకులు దాడులకు పాల్పడ్డారు. అయినా వారిని అరెస్టు చేయకుండా వదిలేయడంతో వారు కోర్టు ద్వారా బెయిల్ తెచ్చుకుని దర్జాగా తిరుగుతున్నారు. పట్టణంలో పలు కేసులు నమోదైన వైసీపీ నాయకులను అరెస్టు చేయకుండా వారు కోర్టు ద్వారా బెయిల్ తెచ్చుకునేలా సహకరించారన్న ఆరోపణలున్నాయి. మండలంలోని ఓబుళనాయునిపల్లిలో ఎన్నికల తర్వాత టీడీపీ వర్గీయులపై కట్టెలు, రాడ్లతో వైసీపీ గూండాలు దాడులు చేశారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు వారిలో ప్రధాన నిందితుడిని వదిలేసి మిగతా వారిని అరెస్టు చేశారు. మిగతా వారి నుంచి పోలీసులు మామూళ్లు పుచ్చుకుని అరెస్టు చేయకపోవడంతో వారు కోర్టు ద్వారా బెయిల్ తెచ్చుకుని దర్జాగా తిరుగుతున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. వైసీపీ నాయకులు గ్రామంలోనే తిరుగుతున్నా.. ఆ విషయం పోలీసులకు తెలిపినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు తెలుపుతున్నారు. ఇలా అయితే బాధితులకు న్యాయం ఎలా చేకూరుతుందని కూటమి నేతలు, ప్రజలు వాపోతున్నారు.

> **సివిల్ పంచాయితీలు చేస్తే చర్యలు తప్పవ్**
>
> ధర్మవరం డివిజన్ పరిధిలో పోలీసు స్టేషన్లలో సివిల్ పంచాయితీలు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవు. ఇసుక అక్రమ రవాణాను అరికడతాం. బాధితులు నేరుగా వచ్చి ఫిర్యాదు చేయవచ్చు.
>
> - శ్రీనివాసులు, డీఎస్పీ, ధర్మవరం

మద్యం దందా..!

పురంలో కర్ణాటక మద్యం జోరు

పట్టుబడిన కర్ణాటక మద్యాన్ని చూపుతున్న సెబ్ అధికారులు (ఫైల్)



- పట్టుబడుతున్నా తగ్గని అక్రమార్కులు
- సరఫరాదారులకు నాయకుల అండ
- యథేచ్ఛగా విక్రయాలు

హిందూపురం, ఆగస్టు 11: మద్యం సరిహద్దు దాటుతోంది. కర్ణాటక నుంచి మద్యం అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. కర్ణాటక నుంచి హిందూపురం రూరల్, పట్టణంలో ఏరులై పారుతోంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటై రెండు నెలలు దాటినా పాత పోలీసు అధికారులే నిన్నటివరకు ఉండటంతో కర్ణాటక మద్యం వ్యాపారం మూడు పువ్వులు, ఆరుకాయలుగా విరాజిల్లుతోంది. రాష్ట్రంలో మద్యం ధరలు ఇంకా తగ్గకపోవడంతోపాటు తక్కువ ధరగల బ్రాండ్లు ఇంకా అందుబాటులోకి రాలేదు. దీంతో కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లకు గిరాకీ తగ్గలేదు. ఈ కారణంగా రోజూ హిందూపురం ప్రాంతంలో ఏదో ఒకచోట కర్ణాటక మద్యం తీసుకొస్తున్న వ్యక్తులు పట్టుబడుతూనే ఉన్నారు. గతంలో ఒకట్రెండు బాక్సులు దొరికేవి. ప్రస్తుతం పదుల సంఖ్యలో పట్టుబడుతున్నాయి. దీనినిబట్టి మొన్నటివరకు ఉన్న పోలీసు అధికారులు, నాయకులతో కలిసి మద్యం అక్రమ రవాణా దందా యథేచ్ఛగా సాగిస్తున్నారని స్పష్టమవుతోంది.

పట్టుబడుతున్నా..

హిందూపురం ప్రాంతానికి కర్ణాటక మద్యం తీసుకొస్తున్న కొంతమంది తరచూ పట్టుబడుతున్నా అక్రమ రవాణా మాత్రం ఆగలేదు. 15 రోజుల వ్యవధిలో ఒకే వ్యక్తి మూడుసార్లు పట్టుబడడమే ఇందుకు నిదర్శనం. పట్టుబడినపుడు ఓ స్టేషన్‌లో కేసే నమోదు చేయలేదు. పట్టుబడిన వాహనాన్ని సైతం వదిలేశారు. ఇందుకు సదరు అధికారి భారీ మొత్తంలో ఆమ్యామ్యాలు పుచ్చుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. పట్టుబడిన ఆ వ్యక్తికి పోలీసుల అండ పుష్కలంగా ఉంది. దీంతో సదరు వ్యక్తి యథేచ్ఛగా మద్యాన్ని కర్ణాటక నుంచి తెచ్చి విక్రయించి, రూ.లక్షలు పోగేసుకుంటున్నాడు. అతడు ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ నాయకులను ఆశ్రయిస్తూ ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతుంటాడు. అతడికి పోలీసులు పుష్కలంగా సహకరిస్తున్నారన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. పట్టణంలోని ఓ వైసీపీ నాయకుడు.. కొంతమంది అనుచరులను ఏర్పాటు చేసుకుని కర్ణాటక నుంచి మద్యం తీసుకొచ్చి డోర్ డెలివరీ చేస్తున్నాడు. ఉదయం ఓ అనుచరుడు మద్యంతో పట్టుబడితే సాయంత్రానికి మరొకరు మద్యం తీసుకురావడం సహజం. ఇలాంటి వ్యక్తులు పోలీసులకు కల్పవృక్షంగా మారారు. గతంలో వైసీపీ పాలనలో తీసుకొచ్చి, డోర్‌డెలివరీ చేస్తూ రూ.లక్షలు సంపాదించాడు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఉన్నా అతడి దందా మాత్రం ఆగట్లేదు. దీనిని బట్టి ఇతడికి నాయకుల అండ ఎంతగా ఉందో అర్థం అవుతోంది. గతంలో హిందూపురం రూరల్ మండలానికి చెందిన ఓ వ్యక్తి పల్లెలకు నిత్యం 30 నుంచి 50 బాక్సుల కర్ణాటక మద్యం సరఫరా చేస్తున్నట్లు తెలిసింది. అయినా ఈ దందాను పోలీసులు అడ్డుకోలేదు. ఇదంతా వారికి తెలిసే జరుగుతున్నట్లు పోలీసు శాఖలో కోడై కూస్తోంది.

పుష్కలంగా అండ

ఇప్పటికీ కర్ణాటక నుంచి మద్యాన్ని తీసుకొచ్చి అక్రమంగా వ్యాపారం చేస్తున్న వ్యక్తులకు కొంతమంది నాయకుల అండ పుష్కలంగా ఉన్నట్లు ఇటు పోలీసు శాఖలో, అటు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. నాయకుల అండ లేకపోతే అక్రమ రవాణా సాగదని పేర్కొంటున్నారు. వీరికి ఇప్పటికే వైసీపీ నాయకుల ప్రోత్సాహం ఉన్నట్లు తెలుస్తోంది. నిన్నమొన్నటిదాకా ఇక్కడ పనిచేసిన పోలీసు అధికారులు అక్రమ దందాకు సహకరించినట్లు ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలోనే కర్ణాటక నుంచి మద్యం తీసుకొచ్చే వారికి ఇటు పోలీసులు, వైసీపీ నాయకుల అండ ఉన్నట్లు తెలిసింది. దీంతో వారు యథేచ్ఛగా వ్యాపారాలు సాగిస్తున్నారు. కొత్తగా వచ్చిన పోలీసు అధికారులైనా అక్రమ మద్యం రవాణాకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుకుంటున్నారు.

> **కర్ణాటక మద్యం తీసుకొస్తే కఠిన చర్యలు**
>
> కర్ణాటక నుంచి మద్యాన్ని అక్రమంగా తీసుకొస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఒకట్రెండుసార్లు వారిపై కేసులు నమోదుచేసి రిమాండ్‌కు పంపుతాం. అప్పటికీ మానుకోకపోతే కఠిన చర్యలు తీసుకుంటాం. మద్యం అక్రమ రవాణా పూర్తిగా అరికడతాం. -కంజాక్షన్, డీఎస్పీ, హిందూపురం

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి: ఎస్పీ

పుట్టపర్తి రూరల్, ఆగస్టు 11: జిల్లాలోని రౌడీషీటర్లు నేరప్రవృత్తికి స్వస్తి పలికి, సత్ప్రవర్తనతో మెలగాలని ఎస్పీ రత్న ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా అన్ని పోలీసుస్టేషన్ల పరిధిలో సీఐలు, ఎస్‌ఐలు ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. రౌడీషీటర్ల నేర చరిత్ర, ప్రస్తుత జీవనవిధానం, స్థితిగతులపై ఆరాతీశారు. నేరాలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. ప్రతి రౌడీషీటర్‌పై కదలికలపై నిఘా ఉంచుతామన్నారు. జిల్లావ్యాప్తంగా పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. రోడ్డుప్రమాదాల నివారణపై వాహనదారులకు అవగాహన కల్పించారు.



నయనమనోహరం.. నృత్యరూపకం

పుట్టపర్తి, ఆగస్టు 11: బాలవికాస్ చిన్నారుల నృత్యరూపకం నయనమనోహరంగా సాగింది. స్థానిక సాయికుల్వంత్ సభామండపంలో ఏలూరు జిల్లా భక్తులు రామకథాసాయిసుధా సంగీత నృత్యరూపకాన్ని ప్రదర్శించారు. రామాయణంలోని వివిధ ఘట్టాలను కళ్లకు కట్టారు. ఎన్ని యుగాలు మారినా రామచరితం మానవాళికి ఆదర్శంగా నిలుస్తుందన్న సందేశమిచ్చారు. అనంతరం సత్యసాయి సెంట్రల్‌ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్.. నాటకంలో పాల్గొన్న భక్తులకు శ్వేతవస్త్రాలను పంపిణీ చేశారు. తరువాత సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.



↑ నృత్యం చేస్తున్న చిన్నారులు.. పూజల్లో పాల్గొన్న భక్తులు ←

గోళ్ల పంచాయతీకి జాతీయస్థాయి గుర్తింపు

స్వాతంత్ర్య దినోత్సవంలో పాల్గొనాల్సిందిగా సర్పంచ్‌కు ఆహ్వానం


కవితాబొజ్జన్న

కళ్యాణదుర్గం, ఆగస్టు 11: మండలంలోని గోళ్ల గ్రామ పంచాయతీకి జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. గ్రామ పంచాయతీని అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపినందుకు ఎర్రకోటలో నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొనాల్సిందిగా సర్పంచ్ కవితకు పిలుపువచ్చింది. ఈ విషయాన్ని ఆదివారం ఎంపీడీఓలు సోలోమోన్, బాలాజీలు వెల్లడించారు. నిధుల కేటాయింపులో వైసీపీ ప్రభుత్వం విఫలమైనప్పటికీ సొంతనిధులు వెచ్చించి పంచాయతీని అభివృద్ధిపథంలో నడిపిస్తున్నట్లు అధికారులు ప్రత్యేక నివేదికలు పంపారు. గ్రామాల్లో రోడ్ల నిర్మాణాలు, వీధి దీపాలు, డ్రైనేజీల పరిశుభ్రత, సురక్షిత నీటిని అందజేయడంతో పాటు అనేక సామాజిక కార్యకలాపాల్లో తన వంతు కృషి చేస్తూ గోళ్ల పంచాయతీని రాష్ట్రంలో అగ్రగామిగా నిలిపింది. భర్త బొజ్జన్న సహకారంతో పంచాయతీ అభివృద్ధికి సాధ్యమైందని కవిత పేర్కొంది. గోళ్ల పంచాయతీకి రాష్ట్ర, జాతీయస్థాయిల్లో గుర్తింపునిచ్చిన ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రులు పయ్యావుల కేశవ్, సత్యకుమార్, సవిత, ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, కలెక్టర్ వినోద్‌కుమార్ తదితరులకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు వివరించారు.

9 గంటలు విద్యుత్ ఇవ్వాలి

విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఆవులదట్ల రైతుల ఆందోళన


ఆందోళన చేస్తున్న రైతులు

రాయదుర్గం రూరల్, ఆగస్టు 11: పంటలు ఎండిపోతున్నాయని, 9 గంటలు ఇవ్వాలని ఆవులదట్ల రైతులు ఆందోళనకు దిగారు. పది రోజులుగా రెండు గంటలు మాత్రమే ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం గ్రామంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద జాతీయ రహదారిపై రైతులు పెద్దసంఖ్యలో వచ్చి గంటపాటు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మరమ్మతుల పేరుతో 9 గంటలు ఇవ్వాల్సిన విద్యుత్‌ను కేవలం రెండు గంటలు మాత్రమే ఇస్తున్నారన్నారు. దీంతో పంటలు ఎండిపోతున్నాయన్నారు. తమ సమస్యను తెలిపేందుకు విద్యుత్ అధికారులకు ఫోన్ చేస్తున్నా లిఫ్ట్ చేయడంలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి 9 గంటల కరెంటును సరఫరా చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతులు కృష్ణ, రామాంజినేయులు, సోమలింగ, వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

తెలుగునాడు వైద్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగరాజు


మాట్లాడుతున్న నాగరాజు

అనంతపురం టౌన్, ఆగస్టు 11: సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలుగునాడు వైద్యఉద్యోగుల ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నాగరాజు పేర్కొన్నారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని ఐఎంఏ హాల్‌లో ఆ సంఘ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. సమావేశంలో నాగరాజు మాట్లాడుతూ వైద్య ఉద్యోగుల కుదింపు కోసం గత వైసీపీ ప్రభుత్వం జీవో 143, 32లను తీసుకొచ్చి తీవ్ర ఆందోళనకు గురిచేసిందన్నారు. బదిలీలలోను ఇష్టారాజ్యంగా వ్యవహరించి మానసికక్షోభకు గురిచేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్య ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు.

నూతన కమిటీ ఎంపిక: తెలుగునాడు ఉద్యోగులు సంఘం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడు నాగరాజు ఆధ్వర్యంలో సత్యసాయి, అనంత జిల్లాల కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతజిల్లా అధ్యక్షుడిగా దేవి మల్లికార్జున, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్. శివప్రసాద్, జనరల్ సెక్రటరీగా పీఎల్ మురళీక్రిష్ణ, కోశాధికారిగా శివయ్యను ఎన్నుకున్నారు.

తగ్గిన పశువుల సంత ఆదాయం

అనంతపురంరూరల్, ఆగస్టు 11: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో జరిగే పశువుల సంత ఆదాయం ఆదాయం తగ్గింది. ఈవారం సంతతో మార్కెట్‌కు రూ.2,69,480 ఆదాయం వచ్చిందని మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి ఆదివారం తెలిపారు. శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత ద్వారా మార్కెట్‌కు రూ.1,59,180, ఆదివారం జరిగిన ఎనుములు, ఎద్దులు, ఆవుల సంతతో రూ.1,10,300 వచ్చిందని వివరించారు.

అమిగోస్ ఆగడాలు..!

- విచ్చలవిడిగా వసూళ్లు
- దొంగచేతికి వైసీపీ ప్రభుత్వం తాళాలు
- 78 చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి దందా
- రూ.800 కోట్లు కొల్లగొట్టిన మైనింగ్ మాఫియా
- దౌర్జన్యం, రౌడీయిజంతో బెదిరింపులు
- బిహార్‌ను తలపించిన అమిగోస్ వ్యవహారాలు
- పోలీసుల అండదండలు


జిల్లా మైన్స్ కార్యాలయం

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 11: సహజంగా లభించే ఖనిజ సంపదపై కన్నేసిన గత వైసీపీ ప్రభుత్వం అమిగోస్ మినరల్స్ సంస్థ ద్వారా దోచుకునేందుకు స్కెచ్ వేసింది. నాటి సీఎం జగన్, అప్పటి పెద్దమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి అత్యంత అనుయాయుడైన తిరుపతికి చెందిన వైసీపీ నేత ప్రసాద్‌రెడ్డితో అమిగోస్ మినరల్స్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థను స్థాపించారు. ఎలాంటి అనుభవం లేని సంస్థకు ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఖనిజ సంపదను కొల్లగొట్టేందుకు అధికారికంగా లైసెన్సు ఇచ్చేశారు. ఇదే అదనుగా అమిగోస్ సంస్థ ఇష్టానుసారంగా ప్రజలపై పడి పీక్కుతినడం ప్రారంభించింది. ప్రభుత్వానికి నామమాత్రంగా ఏడాదికి రూ.130 కోట్లు చెల్లించాలని షరతు పెట్టారు. అమిగోస్ మాత్రం ఏడాదిలోనే సుమారు రూ.800కోట్లు వరకు మైనింగ్ లీజు కాంట్రాక్టర్ల ద్వారా వసూలు చేసినట్లు తెలుస్తోంది. 2023 మార్చి నెలలోనే అమిగోస్ సంస్థతో అగ్రిమెంట్ కోసం ముగ్గురు మైనింగ్ శాఖ డీడీలను సైతం మార్చేశారు. బిహార్‌ను తలపించేలా అమిగోస్ సంస్థ రెండున్నరేళ్లలో బీభత్సం సృష్టించింది. మైన్స్ శాఖను తన గుప్పిట్లో పెట్టుకుని తన ఆగడాలను కొనసాగించింది.

అమిగోస్‌ను నడిపింది ఎవరంటే..?

అమిగోస్ మినరల్స్ ప్రైవేటు సంస్థ వైసీపీకి చెందిన నాయకులది. మాజీ సీఎం జగన్, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి అనుయాయుడు, కళ్యాణదుర్గం వైసీపీ ఎన్నికల ఇన్‌చార్జి, తిరుపతికి చెందిన వైసీపీ నేత, అనంతపురంలోని హుండాయ్ షోరూం ఓనర్ ప్రసాద్‌రెడ్డి ఎండీగా ఉన్న సంస్థే అమిగోస్ మినరల్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ. ఉమ్మడి అనంతపురం జిల్లాలో సహజసిద్ధమైన ఖనిజ సంపదను దోచుకోవడానికి వైసీపీ ప్రభుత్వం అమిగోస్ సంస్థకు ధారాదత్తం చేసింది. దొంగచేతికి తాళాలు ఇచ్చిన చందంగా ఖనిజ సంపదపై రాయల్టీ వసూలు లీజును అమిగోస్‌కు ఇచ్చింది. ఏడాదికి రూ.130కోట్ల చొప్పున రెండేళ్లకు రూ.260కోట్లు అమిగోస్ ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంది. ఇప్పటి వరకు కేవలం రూ.50కోట్లు మాత్రమే ప్రభుత్వానికి అమిగోస్ చెల్లించింది. మిగిలిన సుమారు రూ.210 కోట్ల బకాయి ఇంతవరకు చెల్లించలేదు.

కార్యాలయం సీజ్ చేసినా నిర్వహణ

అమిగోస్ మినరల్స్ సంస్థపై వచ్చిన అవినీతి, అక్రమాల ఆరోపణల నేపథ్యంలో జిల్లా మైన్స్ అధికారులు ఆ సంస్థ కార్యాలయాన్ని సీజ్ చేశారు. అప్పటికే విలువైన కీలక రికార్డులను అమిగోస్ సంస్థ ఇతర ప్రాంతాలకు తరలించినట్లు సమాచారం. సీజ్ చేసిన కార్యాలయంలో అమిగోస్ సంస్థకు సంబంధించిన సిబ్బంది రహస్యంగా రికార్డులను పరిశీలిస్తూ కార్యకలాపాలు కొనసాగిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం మారినా తమ పలుకుబడితే ఎవరినైనా కొనగలం అంటూ బీరాలు పలుకుతున్నారు. బాధిత లీజు కాంట్రాక్టర్లు తమకు రావాల్సిన వాటాల కోసం ధర్నాకు దిగారు. దీంతో వారిపైనే అమిగోస్ ప్రతినిధులు బ్లాక్‌మెయిలింగ్ కింద పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టారు. ప్రతిగా బాధిత కాంట్రాక్టర్లు కేసు పెట్టారు. పోలీసులు కూడా అమిగోస్‌తో కుమ్మక్కయ్యారనే బాధిత కాంట్రాక్టర్లు బహిరంగంగానే ఆరోపణలు చేస్తున్నారు.


అమిగోస్ కార్యాలయం ఎదుట కాంట్రాక్టర్ల ఆందోళన (ఫైల్)

ముగ్గురు అధికారుల బదిలీ

2023 ఫిబ్రవరిలో జిల్లా గనులు భూగర్భశాఖ ఉపసంచాలకులుగా (డీడీ)గా కర్నూలు డీడీ తలారి రాజశేఖర్‌కు అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అమిగోస్ అగ్రిమెంట్‌పై డీడీ రాజశేఖర్ సంతకం చేయకపోగా ఇది నిబంధనలకు విరుద్ధంగా ఉంది...ఇలా చేయరాదని తిరస్కరించారు. దీంతో డీడీ బాధ్యతలు రాజశేఖర్‌ను తప్పించి వెంటనే అనంతపురం ఏడీగా ఉన్న తోట బాలసుబ్రహ్మణంకు అప్పగించారు. వారం రోజులు తిరక్కముందే ఇన్‌చార్జి డీడీగా ఉన్న ఆయన ఎండీఎల్‌కు సంబంధించి అగ్రిమెంట్‌ను తిరస్కరించారు. దీంతో ఆయనను వెంటనే సెలవుపై పంపించారు. ఈ క్రమంలోనే తాడిపత్రి ఏడీగా ఉన్న ఎంపరాల నాగయ్యకు ఇన్‌చార్జి డీడీగా నియమించారు. ఇలా అమిగోస్ సంస్థ ప్రభుత్వ శాఖలపై కూడా ఈ తరహాలో ప్రభావం చూపింది.

బహిరంగంగా ఖనిజ దోపిడీ

ఉమ్మడి జిల్లాలో లభించే ఖనిజ సంపదపై రాయల్టీ వసూలు లీజు అమిగోస్ మినరల్స్ సంస్థకు వైసీపీ ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా అప్పజెప్పింది. మట్టి, రాయి, గ్రానైట్, ఐరన్‌ఓర్, డోలమైట్ వంటి ఖనిజ సంపద తవ్వకాలు, రవాణాపై రాయల్టీ అధికమొత్తంలో వసూలు చేసింది. ఉమ్మడి జిల్లాలో సుమారు 78చెక్ పోస్టులను ఏర్పాటు చేసి, ఆ చెక్‌పోస్టులలో రౌడీలను, మారణాయుధాలతో ఏర్పాటు చేసి కాంట్రాక్టర్ల నుంచి రౌడీ మామూలు వసూలు చేయసాగింది. అసలు సంబంధమే లేని కంపెనీ ప్రజలపై పడి పీక్కుతినింది. జిల్లాలో సుమారు రూ.800కోట్లకు పైగా ఖనిజసంపద నుంచి రాయల్టీ పేరుతో వసూలు చేసినట్లు తెలుస్తోంది.

దౌర్జన్యంతోనే వసూళ్లు



ధనార్జన, దౌర్జన్యంతోనే అమిగోస్ మినరల్స్ సంస్థ జిల్లాలో వసూళ్లు చేసింది. అమిగోస్ సంస్థకు చెందిన ప్రసాద్‌రెడ్డి, జితేంద్ర, పద్మనాభరెడ్డి, రాజశేఖర్, ప్రవీణ్‌కుమార్, సునీల్‌కుమార్ ఉమ్మడి జిల్లాలో క్వారీలపై పడి పీక్కుతిన్నారు. క్వారీ లీజు కాంట్రాక్టర్లపై దౌర్జన్యం చేస్తూ విజిలెన్స్ దాడులు చేయిస్తూ రౌడీ మూకలను వెంటబెట్టుకుని టిప్పర్ల మీద దాడులు చేస్తూ భయభ్రాంతులకు గురిచేసి వసూళ్లకు పాల్పడ్డారు. ప్రశ్నించిన వారిపై అమిగోస్‌కు తొత్తుగా ఉన్న విజిలెన్స్ అడిషినల్ ఎస్పీ మునిరామయ్య, మైన్స్ డీడీ నాగయ్యను పంపి వేధించేవాళ్లు. మైన్స్ మొత్తాన్ని తన గుప్పెట్లో పెట్టుకుని వైసీపీ ప్రభుత్వంలో అమిగోస్ సంస్థ చేసిన ఆగడాలు అన్నిఇన్నీ కావు. వెంటనే అమిగోస్ సంస్థ యజమాన్యాన్ని అరెస్ట్ చేసి చీటింగ్, క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలి.

- చంద్రశేఖర్‌రెడ్డి, బాధిత లీజు కాంట్రాక్టర్

రోడ్డు మీదకు టిప్పర్ వస్తే జరిమానా



వైసీపీ ప్రభుత్వంలో క్వారీ, ఇతర మట్టి తరలింపునకు సంబంధించి టిప్పరు రోడ్డు మీదకు వస్తే కచ్చితంగా అమిగోస్ సంస్థ జరిమాన విధించేంది. అన్ని రకాల అనుమతులు ఉన్నప్పటికీ దౌర్జన్యంగా, బెదిరింపులకు పాల్పడి వసూళ్లు చేసేవారు. ఎవరికి చెప్పుకోవాలో అర్థంకాని పరిస్థితి. ప్రశ్నిస్తే సీఎం, పెద్దిరెడ్డి మంత్రి మావాళ్లే.. ప్రభుత్వం మొత్తం మాదే. మమ్మల్ని ఎవరూ ఏమీ చేయలేరు. బుద్ధిగా పెనాల్టీ కట్టిపోండి అని హెచ్చరించేవారు. మైన్స్ అధికారులకు, జిల్లా కలెక్టర్‌కు పదుల సంఖ్యలో ఫిర్యాదులు చేసినా ఫలితం శూన్యం. ఇప్పటికైనా బిహార్‌ను తలపించేలా వ్యవహరించిన అమిగోస్‌ను వెంటనే సీజ్ చేసి, యాజమాన్యాన్ని అరెస్ట్ చేసి జైలుకు పంపాలి.

- రాజేష్, కాంట్రాక్టర్, అనంతపురం

అమిగోస్ కార్యకలాపాలన్నీ ఆపేశారు



కొత్త ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి దాదాపు అమిగోస్ మినరల్స్ సంస్థకు చెందిన కార్యకలాపాలన్నీ నిలిపివేశాం. అమిగోస్ కార్యాలయాన్ని సీజ్ చేశాం. రికార్డులు ఎవరూ తీసుకుని పోకుండా నిఘా ఉంచాం. ఎంతటి వారినైనా ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా చేసిన వ్యవహారాలపై కఠిన చర్యలు తీసుకుంటుంది. అమిగోస్ సంస్థ చెల్లించాల్సిన రూ.83కోట్ల బకాయిలకు సంబంధించి ఇప్పటికే నోటీసులు జారీ చేశాం. ఇంతవరకు అమిగోస్ సంస్థ యాజమాన్యం నుంచి ఎలాంటి స్పందన రాలేదు. వాళ్లు ఇలాగే నిర్లక్ష్యం చేస్తే కచ్చితంగా రాష్ట్ర ప్రభుత్వం ఆ స్థాయిలో తగిన నిర్ణయం తీసుకుంటుంది.

- నాగయ్య, భూగర్భగనుల శాఖ డీడీ

ఆందోళనలో అన్నదాతలు

క్రస్ట్‌గేట్ కొట్టుకుపోవడంతో ఉలిక్కిపడ్డ రైతాంగం

అనంత జిల్లా తాగు, సాగునీటిపై తీవ్ర ప్రభావం


19వ గేట్ వద్ద నీటి ఉధృతి

రాయదుర్గం, ఆగస్టు 11: తుంగభద్ర జలాశయం క్రస్ట్ గేట్ కొట్టుకు పోయి, నీరంతా వృధాగా పోతుండటంతో జిల్లాలోని హెచ్చెల్సీ ఆయకట్టు రైతాంగం తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోంది. తాగు, సాగుకు జీవనాధారంగా ఉన్న హెచ్చెల్సీపై దీని ప్రభావం తీవ్రంగా ఉండనుంది. నిండుకుండలా ఉన్న టీబీ డ్యాంను చూసి రెండు రాష్ట్రాల ప్రజలు, రైతులు ఆనంద పడ్డారు. అంతలోనే ఓ గేట్ కొట్టుకుపోయిన నీరంతా వృధాగా పోతుండటంతో వారంతా తీవ్ర ఆవేదన చెందుతున్నారు. జిల్లాలో ఉన్న కణేకల్లు, బొమ్మనహాళ్, విడపనకల్లు, ఉరవకొండలతో పాటు వివిధ ప్రాంతాల్లో పంటల సాగు చేయడానికి హెచ్చెల్సీ జలాలే జీవనాధారం. జలాశయం వద్ద నుంచి 105 కి.మీ. పొడవునా ప్రయాణించి ఆంధ్ర సరిహద్దులకు చేరడానికే కోట్లు ఖర్చు పెట్టి హెచ్చెల్సీని ఆధునికీకరించారు. సరిహద్దు నుంచి హెచ్ఎల్ఎంసీ, జీబీసీ ప్రాంతాల మీదుగా పీఏబీఆర్‌కు నీరు చేరి జిల్లాలోని అనంతపురం నగరంతో పాటు వివిధ ప్రాంతాలకు శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం ద్వారా తాగునీరు అందిస్తారు. ముఖ్యంగా హెచ్చెల్సీ ద్వారా 32 టీఎంసీలు వాటా రావాల్సి ఉండగా నీటి లభ్యతను బట్టి 26 టీఎంసీల దాకా నీరు ప్రతి ఏడాది అందుతున్నాయి. అందులో పది టీఎంసీల దాకా హెచ్చెల్సీ జలాలు తాగునీటికి వాడుకోవాల్సి ఉంటుంది. మిగిలిన జలాలను సాగు కోసం వినియోగించుకుంటారు. హెచ్చెల్సీ కాలువకు 15 రోజుల కిందట నీరు విడుదల చేసిన విషయం తెలిసిందే. ఇప్పటి వరకు రెండు టీఎంసీలు కూడా జిల్లాకు అందలేదు. ఈ నేపథ్యంలో ఒక్కసారిగా క్రస్ట్‌గేట్ చైన్‌లింక్ తెగిపోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది.

ఒక వైపు వరినాట్లు.. మరోవైపు తాగునీటి పంపింగ్

తుంగభద్ర ఎగువకాలువకు జలాశయం నుంచి 1500 క్యూసెక్కుల మేరకు సరిహద్దులో అందుతుండటంతో రైతులు ఆయకట్టులో వరినాట్లు సాగు చేయడంలో బిజీగా ఉన్నారు. కణేకల్లు, బొమ్మనహాళ్ మండలాలలో ఇప్పటికే డిస్ట్రిబ్యూటరీల కింద వరినారు సాగు ప్రక్రియ పూర్తి చేసి నాట్లు వేసే దశకు చేరుకుంటున్నారు. చివరి ఆయకట్టులో ఇప్పుడిప్పుడే వరినారు వేస్తున్నారు. పీఏబీఆర్ వద్ద ఉన్న శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం ద్వారా పంపింగ్ ప్రక్రియను ప్రారంభించారు. రాయదుర్గం, ఉరవకొండ లాంటి పట్టణాలకు తాగునీరు అందించేందుకు నిర్మించుకున్న సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకులను నింపుకునే పనిలో భాగంగా కాలువ నుంచి నీటి పంపింగ్ ప్రక్రియ ప్రారంభించారు. వేసవిలో ఇబ్బంది లేకుండా ఉండటానికి తాగు నీటి అవసరాలకు పది టీఎంసీల మేరకు నీటిని కేటాయించారు. దీంతో ఓ వైపు పంపింగ్ ప్రక్రియ జరుగుతుండగా మరో వైపు వరినాట్లు సాగుతున్నాయి. ఈనేపథ్యంలో చైన్‌లింక్ తెగిపోయి క్రస్ట్ గేట్ కొట్టుకు పోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది.

వర్షాలు కురిస్తేనే..

సాధారణంగా జూలై నెలలో కురిసే వర్షాలతో జలాశయంలో నీరు మెండుగా చేరుకుని ఆగస్టు రెండోవారానికి జలాశయం పూర్తిగా నిండిపోతుంది. ఈ ఏడాది పెద్ద ఎత్తున వర్షాలు కురవడంతో ఎగువ నుంచి పెద్ద ఎత్తున వరదనీరు చేరి తక్కువ సమయంలోనే జలాశయం నిండిపోయింది. కాగా క్రస్ట్‌గేట్ తెగిపోవడంతో పూర్తిగా పరిస్థితులు, బోర్డు అధికారుల అంచనాలు మారిపోతున్నాయి. జలాశయం 100 టీఎంసీలకు మించి నీటి నిల్వతో నిండుకుండలా ఉండేది. దీంతో క్రస్ట్‌గేట్లను ఎత్తి 30 వేల క్యూసెక్కుల నీరు నదికి వదులుతూ ఉండేవారు. ఒక్కసారిగా క్రస్ట్ గేట్ తెగిపోవడంతో పరిస్థితులు తారుమారయ్యాయి. ఎగువ నుంచి నీటి లభ్యత క్రమేపీ తగ్గుముఖం పట్టి ఇన్‌ఫ్లో 25 వేల క్యూసెక్కులకు పడిపోయింది. రోజుకు ఒక టీఎంసీ మేరకు వివిధ కాలువల నుంచి ఆయా రాష్ట్రాల వాటా నీటిని విడుదల చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో క్రస్ట్‌గేట్ తెగిపోవడం పెద్ద దెబ్బ తగిలినట్లే. ఒకవైపు ఇన్‌ఫ్లో పూర్తిగా పడిపోవడం, మరో వైపు క్రస్ట్‌గేట్ ప్రభావంతో ఉన్ననీటిని దిగువకు వదిలేయాల్సిన పరిస్థితి. ఇలాంటి దశలో మరమ్మతులు పూర్తి చేసిన అనంతరం ఎగువన వర్షాలు కురిసి మళ్లీ డ్యాంకు నీరు చేరితే ఏ ఇబ్బందులు ఉండవు. ఒక వేళ వర్షాభావ పరిస్థితులు ఏర్పడితే పరిణామాలు భిన్నంగా ఉంటాయని రైతుల్లో ఆందోళన మొదలైంది. అయితే గతంలో ఆగస్టు చివరిలో కూడా వర్షాలు కురిసి జలాశయానికి సమృద్ధిగా నీరు చేరిన దాఖలాలు ఉండటంతో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని బోర్డు అధికారులు భావిస్తున్నారు.

రెండు వాహనాల ఢీ... ఒకరి మృతి

ముగ్గురికి తీవ్రగాయాలు


దెబ్బతిన్న వాహనం, మృతిచెందిన మధుసూదన్ (ఫైల్)

చిలమత్తూరు, ఆగస్టు 11: ఎదురెదురుగా వస్తున్న రెండు వాహనాలు ఢీ కొనడంతో ఒకరు ప్రమాదస్థలంలోనే మృతి చెందగా, మరో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. ఏఎస్ఐ సుబ్రహ్మణ్యం వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి. కర్ణాటకకు చెందిన మధుసూధన్, శ్రీనివాసులు, గౌరీకృష్ణ హిందూపురం వైపు నుంచి ఇన్నోవాలో ఆదివారం ఉదయం బెంగళూరు బయల్దేరారు. హిందూపురానికి చెందిన షెక్షావలి తన కారులో బెంగళూరు ఎయిర్‌పోర్టు నుంచి సొంతూరికి వస్తున్నాడు. 544-ఈ జాతీయ రహదారిలోని దేమకేతేపల్లి సమీపంలోకి రాగానే రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో ఇన్నోవా వాహనంలో ప్రయాణిస్తున్న కర్ణాటకకు చెందిన మధుసూదన్ (26) అక్కడికక్కడే మృతిచెందగా.. శ్రీనివాసులు, గౌరీకృష్ణకు తీవ్రగాయాలయ్యాయి. మరో వాహనదారుడు షెక్షావలి వాహనంలోనే ఇరుక్కుపోయాడు. స్థానికులు అతడికి బయటకు తీవారు. అతడి కాళ్లకు తీవ్రగాయాలయ్యాయి. ప్రమాదంలో మృతి చెందిన మధుసూధన్ కోలార్ జిల్లాలోని శ్రీనివాసపురం జిల్లా హెల్త్ అండ్ ఫ్యామిలి వెల్ఫేర్ జనరల్ ఆసుపత్రిలో ఆక్సిజన్ ప్లాంట్ టెక్నీషియన్‌గా పని చేస్తున్నట్లు తెలిపారు.

నీరా కోసం వచ్చి తిరిగిరాని లోకాలకు..

రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన మధుసూదన్, గాయపడిన శ్రీనివాసులు, గౌరీశంకర్ నీరా కోసం వచ్చినట్లు స్థానికులు తెలిపారు. వాహనంలో నీరా బాటిళ్లు లభించాయి. దీన్నిబట్టి చూస్తే హిందూపురం సమీపంలోని ఈత వనానికి వెళ్లి నీరా తీసుకెళ్తూ ప్రమాదం బారిన పడినట్లు తెలుస్తోంది.

ఏపీఎస్ఆర్టీసీ బస్సు బోల్తా

పలువురికి గాయాలు

చిలమత్తూరు, ఆగస్టు 11: పుట్టపర్తి ఆర్టీసీ డిపోకి చెందిన బస్సు కర్ణాటకలోని 44వ జాతీయ రహదారిపై బాగేపల్లి సమీపంలోని చుందూరు క్రాస్ వద్ద ఆదివారం మధ్యాహ్నం అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో బస్సులోని ఇద్దరు డ్రైవర్లతోపాటు ఇద్దరు ప్రయాణికులకు తీవ్రగాయాలయ్యాయి. మిగిలిన ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. పుట్టపర్తి డిపోకి చెందిన ఆర్టీసీ బస్సు బెంగళూరు నుంచి పుట్టపర్తికి వస్తోంది. బాగేపల్లి సమీపంలోని చుందూరు క్రాస్ వద్దకు రాగానే బస్సు స్టీరింగ్ పనిచేయక అదుపుతప్పింది. డ్రైవర్ బాబయ్య కంట్రోల్ చేయడానికి ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. బస్సు రోడ్డు పక్కన ఉన్న గుంతలోకి పడింది. ప్రమాదంలో డ్రైవర్ బాబయ్యతో పాటు మరో డ్రైవర్ లోకేశ్వరయ్య, ఇద్దరు ప్రయాణికులకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని బాగేపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స కోసం తరలించారు. డ్రైవర్ లోకేశ్వరయ్య తలకు తీవ్రమైన గాయం కావడంతో మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలించారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు, కర్ణాటక పోలీసులు అక్కడికి చేరుకొని ప్రయాణికులను బస్సులో నుంచి సురక్షితంగా బయటికి తీసుకొచ్చారు. ప్రమాద సమయంలో 13 మంది ప్రయాణికులు ఉన్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు.


బోల్తా పడ్డ ఏపీఎస్ ఆర్టీసీ బస్సు, గాయపడిన డ్రైవర్ లోకేశ్వరయ్య

ఆసుపత్రి ఎదుట ఆందోళన

వైద్యుల నిర్లక్ష్యంపై మృతుడి కుటుంబీకుల నిరసన


ఆసుపత్రి ఎదుట ధర్నా చేస్తున్న మృతుడి కుటుంబసభ్యులు, బంధువులు, అరవింద్ (ఫైల్)

గుంతకల్లుటౌన్, ఆగస్టు 11: తమ కుమారుడు అరవింద్ (24) వైద్యుల నిర్లక్ష్యం వల్లే మృతి చెందాడని స్థానిక 60 అడుగుల రోడ్డులోని ఓ ప్రైవేటు ఆసుపత్రి వద్ద మృతుడి కుటుంబసభ్యులు, బంధువులు ఆదివారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత నెల 29న కిడ్నీలో రాళ్లు ఉన్నాయని ఆసుపత్రిలో చేరాడన్నారు. పరీక్షలు నిర్వహించిన అనంతరం వారం రోజులపాటు అడ్మిట్ చేసుకుని ట్రీట్‌మెంట్ ఇచ్చి ఈనెల 5న కర్నూలుకు వెళ్లాలని సూచించారని తెలిపారు. అక్కడ ట్రీట్‌మెంట్ తీసుకుని అనంతరం హైదరాబాదులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లాడన్నారు. కిడ్నీ ఇన్‌ఫెక్షన్ అయి షుగర్ లెవెల్స్ పెరిగి మృతిచెందాడన్నారు. దాదాపు రూ. 6లక్షలు వైద్యం కోసం ఖర్చు చేయడం జరిగిందని వివరించారు. తమ కుమారుడు వైద్యుల నిర్లక్ష్యం వల్లే మృతిచెందాడని ఆసుపత్రి ఎదుట రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. సమాచారం అందుకున్న వన్‌టౌన్, టూటౌన్ సీఐలు రామసుబ్బయ్య, గణేష్, రూరల్ ఎస్ఐ సురేష్ ఘటనా స్థలానికి చేరుకుని మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులతో మాట్లాడారు. వైద్యులతో మాట్లాడి న్యాయం చేస్తామని చెప్పడంతో వారు ఆందోళన విరమించారు.

ఆంధ్ర సౌత్‌జోన్ జట్టుకు నలుగురి ఎంపిక


ధారామోహన్ తేజస్విని మాన్విత చక్రిక దండు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 11: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ సౌత్‌జోన్ బాలికల అండర్-15 క్రికెట్ జట్టుకు జిల్లాకు చెందిన నలుగురు ఎంపికయ్యారు. చక్రిక దండు, ధారామోహన్, మాన్విత, తేజస్విణి ఏసీఏ సౌత్‌జోన్ అండర్-15 బాలికల క్రికెట్ జట్టులో చోటు సాధించారు.

జీడిపల్లి రిజర్వాయర్‌కు ఆగిన ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, ఆగస్టు 11: రాగులపాడు పంప్‌హౌస్‌లో తలెత్తిన సాంకేతిక కారణాలతో రెండు మోటార్లు ఆఫ్ చేయడంతో జీడిపల్లి రిజర్వాయర్‌కు ఆదివారం ఇన్‌ఫ్లో ఆగినట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 0.263 టీఎంసీల నీరు నిల్వ వుందని సోమవారం నుంచి కృష్ణా జలాలను విడుదల చేయడం జరుగుతుందని అధికారులు పేర్కొన్నారు.

అకడమిక్ కన్సల్టెంట్ పోస్టులకు ఇంటర్వ్యూలు

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 11: ఎస్కేయూలోని పలువిభాగాల్లో పాఠ్యాంశాలను బోధించేందుకు అకడమిక్ కన్సల్టెంట్ పోస్టులకు ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ అనిత ఆదేశాలమేరకు ప్రిన్సిపాల్ కృష్ణకుమారి నోటిఫికేషన్ జారీచేశారని ఆదివారం పీర్వో ప్రొఫెసర్ రామగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 సంవత్సరానికి సైన్స్ విభాగంలో బయోకెమిస్ట్రీ, బోటనీ, కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్, జియోగ్రఫీ, ఇన్‌స్ట్రుమెంటేషన్, ఎలక్ట్రానిక్స్, మ్యాథమెటిక్స్, మైక్రోబయోలజీ, ఫిజిక్స్, పాలిమర్ సైన్స్, సెరికల్చర్, జువాలజీ, ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్టాటిస్టిక్స్ డిపార్ట్‌మెంట్స్‌లో ఖాళీలు ఉన్నాయన్నారు. ఆర్ట్స్ డిపార్ట్‌మెంట్స్‌లో ఎకనామిక్స్, ఇంగ్లీష్, తెలుగు, కామర్స్, లైబ్రరీ సైన్స్, అడల్ట్ ఎడ్యుకేషన్, లా, రూరల్ డెవలప్‌మెంట్, సోషల్‌వర్క్, హిస్టరీ, ఎంబీఏ, పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగాల్లో పని చేసేందుకు అకడమిక్ కన్సల్టెంట్స్ పోస్టులకు వాక్ ఇన్ ఇంటర్వ్యూలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఎంపికైన అభ్యర్థులకు గంటల కొలమాన ప్రకారం జీతం ఉంటుందన్నారు. 13, 14తేదీల్లో ఆయా విభాగాల్లో నిర్వహించే ఇంటర్వ్యూలకు ఆసక్తి గల అభ్యర్థులు సర్టిఫికెట్స్‌తో హాజరుకావాలని కోరారు.


విజేతలకు బహుమతులు అందజేస్తున్న అధ్యక్షుడు

ముగిసిన జిల్లాస్థాయి చెస్ పోటీలు

ధర్మవరం, ఆగస్టు 11 : ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ యూటీఎఫ్ స్వర్ణోత్సవ సంబరాల్లో భాగంగా రెండు రోజులుగా కాకతీయ విద్యానికేతన్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి చెస్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ చెస్ పోటీల్లో మహిళా టీచర్స్ విభాగంలో అమలాపురానికి చెందిన సబిహాభాను, ఎన్‌పీకుంటకు చెందిన సీతారత్నం, ధర్మవరానికి చెందిన దుర్గా, మహేశ్వరి విజేతలుగా నిలిచారు. అలాగే పురుష టీచర్స్ విభాగంలో కొత్తచెరువు మండలం కేశాపురానికి చెందిన శివకృష్ణ, గుడిబండకు చెందిన జయచంద్ర, లేపాక్షికి చెందిన శ్రీనివాసరెడ్డి, నీకేపల్లికి చెందిన లక్ష్మీనారాయణస్వామి విజేతలుగా నిలిచారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి సుధాకర్, ఉపాధ్యక్షుడు జీహెచ్‌బాబు, ఆడిట్ కమిటి సభ్యుడు రామకృష్ణ నాయక్, సీనియర్ నాయకులు నారాయణస్వామి, చెన్నకేశవులు విజేతలకు మెమెంటోలు, బహుమతులు అందజేశారు. ఈ విజేత ఉపాధ్యాయులు సెప్టెంబరులో గుంటూరులో జరిగే రాష్ట్ర స్థాయి యూటీఎఫ్ స్వర్ణోత్సవాల పోటీల్లో పాల్గొనే అర్హత సాధించారని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయ నిర్ణేతలు ఆదిరత్నకర్, కిశోర్‌కుమార్,సోమశేఖరప్రసాద్, పీడీలు రమేశ్, నాగేంద్ర పాల్గొన్నారు.

ఎండుతున్న ఆశలు..!

- వర్షం కోసం రైతుల నిరీక్షణ
- అరకొర పదునులో సాగుతో మొలకలు రాని వైనం

తాడిమర్రి, ఆగస్టు 11: వర్షాలు రాక... సాగు చేసిన పంటలు ఎండిపోతుండటంతో.. రైతుల ఆశలు నీరుగారిపోతున్నాయి. మండలంలోని రైతులు రోజూ ఆశగా ఆకాశం వైపు చూస్తున్నారు. కొందరు రైతులు సాగుచేసిన పంటను కాపాడుకు నేందుకు చూస్తుంటే... ఇంకొందరు కొత్తగా పంట సాగుచేసేందుకు ఎదురు చూస్తు న్నారు. కునుకుంట్ల, చిల్లకొండ య్యపల్లి, శివంపల్లి గ్రామాలకు చెందిన పండ్లతోటల రైతులు మాత్రం ఇప్పుడున్న పండ్లతోటలను బతికించుకునేందుకు వర్షం కోసం ఎదురుచూస్తున్నారు. ఇలా మండలంలో రైతుల పరిస్థితి ఒక్కొక్కరిది ఒకలా ఉంది. మండల వ్యాప్తంగా 12,695 హెక్టార్ల వ్యవసాయ భూమిలో ఖరీఫ్‌లో సాగుచేస్తారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనప్పటి నుంచి ఇంతవరకు మంచి పదునైనా వాన కురువలేదు. అక్కడక్కడ వర్షం పడిన పంటలు సాగుచేసిన రైతులు సరిగ్గా మొలవక ఇబ్బందులు పడుతున్నారు. 75 శాతం భూముల్లో ఖరీఫ్ పంట సాగుచేసేందుకు సిద్ధం చేసుకుని కనీసం ప్రత్యామ్నాయ పంటలైన సాగుచేద్దామని ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే వేరుశెనగ పంట సాగుచేసిన రైతులు పంట ఎండిపోతుంటే ఈ ఏడాది కూడా ఇక నష్టాలే మిగిలాయని మౌనంగా రోధిస్తున్నారు.

గుడ్డంపల్లి గ్రామానికి చెందిన దళిత రైతు రంగప్ప పెద్దకోట్ల వద్ద తన ఐదు ఎకరాల భూమిలో రెండు నెలల క్రితం 500 కేజీలు వేరుశెనగ వేసి పంట సాగుచేశాడు. అందులో సగానికిపైగా మొలవకపోగా మిగిలిన పంట కూడా ఎండిపోతోంది. ఇక పండ్లతోటల విషయానికి వస్తే చీని, దానిమ్మ రైతులు ఈ ఏడాది పంట సాగుచేందుకు రెండు నెలల నుంచి చెట్లకు నీరు వదలకుండా వాడుపెట్టారు. పంట పెట్టాలంటే గాలివేగం తగ్గి మంచి వర్షం కురిసినప్పుడు చెట్లకు నీరువదిలితే బాగా పూతలు వచ్చి పంట పండుతుంది. రోజురోజుకి గాలివేగం పెరుగుతోందే కానీ తగ్గడంలేదు. ఇక రెండు.. మూడు రోజుల కొకసారి చిరుజల్లులు కురిసిపోతుంది కానీ బలమైన వర్షం రాలేదు. దీంతో పండ్లతోటల రైతులు కూడా వర్షం కోసం ఎదురుచూడాల్సి వస్తోంది. ఇక నాలుగు గ్రామాల రైతులైతే కనీసం చెట్లను కాపాడుకుంటే చాలు చెరువులు, కుంటలకు నీరు వచ్చిన తరువాత పంటలు సాగుచేసుకుంటామంటున్నారు.


ఎండుతున్న వేరుశనగ పంట


సాగుకు సిద్ధం చేసిన పొలం

ఫీజు ఎలా కట్టాలి?



నా కుమారుడు ఫిజియో థెరపీ ఫైనల్ ఇయర్ చదువు తున్నాడు. అందుకు కట్టాల్సిన ఫీజు రూ.80 వేలతో ఐదు ఎక రాలలో వేరుశెనగపంట సాగు చేశా. అది సరిగ్గా మొలవ కపోగా ఇప్పుడు ఎండిపోతోంది. పంటబాగా వస్తే లేటుగా అయిన ఫీజు కడతామను కున్నా. ఇప్పుడు ఏమి చేయాలో దిక్కుతోచడంలేదు.

-రంగప్ప, రైతు, గుడ్డంపల్లి

వర్షం కోసం చూస్తున్నాం



నాలుగు వేలు దానిమ్మచెట్లు, 500 చీనీచెట్లు వాడి పోతున్నాయి. వర్షం కోసం ఎదురుచూస్తున్నాం. బాగా వర్షం కురిస్తే తప్పా పంట సాగుచేయలేం. వాతావ రణంలో గాలి వేగం తగ్గకుంటే పంట సాగుచేసిన పూత నిలబడదు. మంచి వర్షం కురిస్తే తప్పా ఏమీచేయలేని స్థితిలో ఉన్నాం.

- ప్రతాప్, రైతు, ఏకపాదంపల్లి

వైభవంగా సీతారాముల కల్యాణం


అలంకరణలో స్వామి, అమ్మవార్లు

ముదిగుబ్బ, ఆగస్టు 11 : మండలంలోని నల్లచెర్లోపల్లి గ్రామంలో శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. వందలాది మంది భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొనడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్, ధర్మవరం నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి చిలకం మధుసూదన్‌రెడ్డి పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం వారు గ్రామంలో పర్యటిస్తూ సమస్యలపై ఆరా తీశారు.


గ్రామంలో సమస్యలు తెలుసుకుంటున్న పరిటాల, చిలకం


వెంకటాపురంలోని సంపద తయారీ కేంద్రం


కేంద్రంలో పడివున్న కర్ణాటక టెట్రా, మద్యం ప్యాకెట్లు

'సంపద' కేంద్రాలా... మందుబాబులకు నిలయాలా..!

ఓబుళదేవరచెరువు, ఆగస్టు 11: చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు మందుబాబులు నిలయాలుగా మారాయి. ఇందుకు నిదర్శనం వెంకటాపురం పంచాయతీలోని నారప్పగారిపల్లి సమీపంలోని చెత్త సంపద తయారీ కేంద్రం. చెత్త నుంచి సంపద తయారు చేయడం కోసం గతంలో టీడీపీ ప్రభుత్వం వీటిని ఏర్పాటు చేసింది. అయితే గత వైసీపీ ప్రభుత్వం వీటిని నిర్లక్ష్యం చేయడంతో నిరుపయోగంగా మారాయి. మందుబాబులు మాత్రం చెత్త సంపద కేంద్రలో నిత్యం మందు సేవిస్తూ, అక్కడే మందు బాటిల్స్, కర్ణాటక టెట్రా ప్యాకెట్లు పడేస్తున్నారు. దీంతో అవి మందుబాబులకు నిలయాలుగా మారడంతో చుట్టుపక్కల వారు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

అడ్‌హక్ కమిటీ ఏకగ్రీవం

పుట్టపర్తి రూరల్, ఆగస్టు 11 : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జిల్లా పంచాయతీ కార్యదర్శుల అడ్‌హక్ కమిటీ అధ్యక్షుడు రామమోహన్ అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శుల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఇందులో జిల్లాపంచాయతీ కార్యదర్శుల అడ్‌హక్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రామమోహన్, ప్రధానకార్యదర్శిగా ఈశ్వర్, కోశాధికారిగా జయపాల్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడిగా గోవర్ధన్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా గోపి, గణేష్ రెడ్డి, అసోషియేట్ సెక్రటరీగా రెజ్వానా, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా రాజు, ఆరుణ, మహిళా సెక్రటరీలుగా త్రివేణి, మహ్మద్ అలీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడు రామమోహన్ మాట్లాడుతూ.. జిల్లాలోని పంచాయతీ కార్యదర్శుల సమస్యలపై సమష్టిగా పోరాడదామన్నారు.


మాట్లాడుతున్న అడ్‌హక్ కమిటీ కోశాధికారి జయపాల్

ఒరిగిన విద్యుత్ స్తంభం

ధర్మవరంరూరల్, ఆగస్టు 11 : మండలంలోని కుణుతూరు గ్రామంలోని బీసీ కాలనీ నందు ప్రధాన రహదారిలో ఓ విద్యుత్ స్తంభం ఒరిగి ప్రమాదకరంగా ఉంది. స్తంభం పూర్తిగా ఒరిగిపోయి తీగలు కిందకు వేలాడుతున్నాయి. స్తంభాన్ని మార్చాలని పక్కనే మరో స్తంభాన్ని ఏర్పాటు చేశారు. అయితే ఆ నూతన స్తంభానికి విద్యుత్‌తీగలు అమర్చ కుండా అలాగే వదిలేశారు. నెలలు తరబడి ఇలానే ఉంది. దీంతో ప్రస్తుతం గాలీవానలకు ప్రమాదకరం జరిగే అవకాశం ఉందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు నిర్లక్ష్యం వీడి ఒరిగిన విద్యుత్ స్తంభాన్ని తొలగించి.. నూతన స్తంభానికి విద్యుత్ తీగలు అమర్చాలని గ్రామస్థులు కోరుతున్నారు.


కూలేందుకు సిద్ధంగా ఉన్న స్తంభం

కదిరి సీఐ బాధ్యతల స్వీకరణ



కదిరి, ఆగస్టు 11: పట్టణ సీఐగా డీవీ నారా యణరెడ్డి ఆది వారం బాధ్యతలు స్వీకరించారు. అనం తపురంలో పనిచేస్తున్న ఆయనను కదిరికి బదిలీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న సీఐ పుల్లయ్య వీఆర్‌కు పంపారు.

చేనేత కార్మికులను ఆదుకోవాలి

తోపుడుబండిపై మగ్గంతో నిరసన ర్యాలీ

ధర్మవరం, ఆగస్టు 11: ప్రభుత్వాలు చేనేత కార్మికులకు గతంలో అందించే పథకాలను పునరుద్ధరించి.. ఆదుకోవాలని చేనేత కార్మికులు కోరారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం తోపుడు బండిపై చేనేత మగ్గం ఉంచి కొత్తపేట సర్కిల్‌లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం చేనేత కార్మికుడు చింతా శ్రీనివాసులు మాట్లాడుతూ.. ధర్మవరంలో చేనేత కార్మికులు గతంలో వేలాది మంది చేనేత వృత్తిపై ఆధారపడి జీవించేవారన్నారు. అయితే రానురాను చేనేత పరిశ్రమ కుదేలైందన్నారు. రాజకీయ నాయకులు, అధికారులు మేల్కొని చేనేతలను ఆదుకోవాలని కోరారు. ఈమధ్యకాలంలో పవర్‌లూమ్స్ యజమానులు కూడా దెబ్బతిం టున్నారన్నారు. కావున చేనేత పరిశ్రమకు పూర్వవైభవాన్ని తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు.


తోపుడు బండిపై మగ్గాన్ని ఉంచి ర్యాలీ నిర్వహిస్తున్న చేనేత కార్మికులు

ముగిసిన రావుడి ఆంజనేయస్వామి ఉత్సవాలు

అగళి, ఆగస్టు 11 : మండ లంలోని రావుడి రావుడి ఆంజనేయ స్వామి దేవాలయంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. వందల మంది భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు భక్తిశ్ర ద్ధలతో హారతులు తీసుకొచ్చారు. స్వామి సన్నిధిలో ఇటీవల రూ. 50 లక్షలతో కల్యాణ మండపం నిర్మిం చారు. భక్తులు అధిక సంఖ్యలో వి రాళాలు అందజేయడంతో ఇది సాధ్యమైందని గ్రామస్థులు, ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.


అలంకరణలో ఆంజనేయస్వామి

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ

మడకశిరటౌన్, ఆగస్టు 11 : పట్టణంలోని 15వ వార్డు యాదవ కల్యాణ మండపం సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపనను కన్నుల పండువగా నిర్వహించారు. స్వామివారికి ఆదివారం క్షీరాభిషేకం, కుంకుమార్చన, విశేష అలంకరణ, హోమాలు తదితర పూజా కార్యక్ర మాలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని అనేక మంది భక్తులు తరలివచ్చి స్వామివారికి పూజలు చేశారు. నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. మధ్యాహ్నం అన్న దానం చేపట్టారు.


ఆంజనేయస్వామి విగ్రహం

చౌడేశ్వరీ ఆలయానికి రూ.లక్ష విరాళం

కదిరి, ఆగస్టు 11: తలుపుల మండలం బత్రేపల్లిలో నిర్మిస్తున్న శ్రీచౌడేశ్వరీ దేవి ఆలయం, శివాలయం అభివృద్ధికి టీడీపీ రాష్ట్ర నిర్వాహణ కార్యదర్శి పవన్ కుమార్‌రెడ్డి రూ.లక్ష విరాళం ఆదివారం అందించారు. ఆయనకు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రామక్రిష్ణారెడ్డి, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


చెక్కు అందజేస్తున్న పవన్

నత్తనడకన నగరవన నిర్మాణం

నాణ్యత నామమాత్రం.. గత వైసీపీ పాలకుల తీవ్ర నిర్లక్ష్యం


నగరవనం ముఖద్వారం


నిర్మాణంలో ఉన్న భోజనశాల

పుట్టపర్తి టౌన్, ఆగస్టు 11: పుట్టపర్తి మండలం అమ్మగొండపాళ్యం గ్రామ సమీపంలో నిర్మిస్తున్న నగర వనం నిర్మాణ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. పుట్టపర్తి జిల్లా కేంద్రానికి ఎనిమిది కిలోమీటర్ల దూరంలో రిజర్వు అడవిలో ఈ నగర వనం నిర్మాణం జరుగుతోంది. 2019 జనవరి ఆరో తేదీన నాటి ఎమ్మెల్యే, చీఫ్ విప్ పల్లె రఘునాథ్‌రెడ్డి ఈ నగర వనం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం కొంతమేర పనులు జరిగాయి. తరువాత వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడతో ఈ నగరవనం నిర్మాణ పనులు పూర్తిగా ఆగిపోయాయి. మళ్లీ ఎన్నికలు సమీపిస్తుండటంతో గత యేడాది చివరిలో వైసీపీ ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఈ యేడాది ఫిబవరి నుంచి పనులు మొదలు పెట్టారు. ప్రస్తుతం నగర వనం ముఖద్వారం పూర్తికాగా, ఇంకా డైనింగ్ హాల్ నిర్మాణంలో ఉంది. అలాగే మరుగుదొడ్లను కొంతవరకు ఏర్పాటు చేశారు. చిన్నారులు ఆడుకోవడానికి ఆట వస్తువులను, పార్కులు ఏర్పాటు చేశారు. అయితే ఈ నిర్మాణాలపై సంబంధిత అధికారులు పర్యవేక్షణ సరిగా లేకపోవడంతో నిర్మాణాల్లో నాణ్యత లోపించిందనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. కాంట్రాక్టర్ తూతూ మంత్రంగా నిర్మాణ పనులు చేపట్టినట్లు విమర్శలున్నాయి.


చిన్నారుల ఆటవస్తులు

నాణ్యతను పరిశీలిస్తాం



నగర వన నిర్మాణానికి రూ.రెండు కోట్ల అంచ నాలతో రూపొందించగా, అటవీశాఖ నుంచి రూ. కోటీ 40 లక్షలు విడుదలయ్యాయి. 2.7 కిలోమీటర్ల పరిధిలో 43.3 హెక్టార్ల విస్తీర్ణంలో ఈ నగరవనాన్ని నిర్మిస్తున్నాం. ఈ నిర్మాణాలు పూర్తి కావడానికి మరో రెండేళ్లు పట్టవచ్చు. రాత్రి సమయంలో బస చేయడానికి కాటేజీలు నిర్మిస్తున్నాం. నాణ్యతను పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

- రవీంద్రనాథ్‌రెడ్డి, డీఎఫ్ఓ

కంటి వైద్యశిబిరం

ధర్మవరం, ఆగస్టు 11: స్థానిక రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో శంకర కంటి ఆస్పత్రి సహకారంతో ఆదివారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 146 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా.. 89 మందిని కంటి ఆపరేషన్‌కు ఎంపిక చేసినట్లు క్లబ్ ఉపాధ్యక్షుడు నరేంద్రరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సెక్రటరీ నాగభూషణం, క్యాంపు ఛైర్మన్ శ్రీనివాసరెడ్డి, క్లబ్ ప్రతినిధులు ప్రసన్న, శివయ్య, సుదర్శనగుప్తా, మనోహరగుప్తా, కొండయ్య, రామకృష్ణ పాల్గొన్నారు.

కేసు నమోదు

గాండ్లపెంట, ఆగస్టు 11: మండలంలోని కల్లుబా యి తండాలో రెడ్డెమ్మపై దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ తిరుమలరెడ్డి ఆదివారం తెలిపారు. ఈనెల 8న కురమామిడి పంచాయతీలోని కల్లుబాయి తండాలో రెడ్డెమ్మపై తొమ్మిది మంది కట్టెలతో దాడిచేశారన్నారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

గంగమ్మ తల్లికి నిత్య పూజోత్సవం

ధర్మవరంరూరల్ : మండలంలోని కుణుతూరులో నూతన ఆలయంలో గంగమ్మ తల్లికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. విగ్రహ ప్రతిష్ఠ చేసిన అనంతరం 41 రోజుల తర్వాత నిత్యపూజ కార్యక్రమంలో భాగంగా ఆదివారం అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చన, నైవేద్యం సమర్పించారు. అమ్మవారికి మకరతోరణం, పూజసామగ్రి తెచ్చిన దాతలు శ్రీదేవి, గంగయ్యను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ, గ్రామస్థులు పాల్గొన్నారు.



ఇలా ఉంటే..

వెళ్లేది ఎలా..?

దుర్భరంగా గ్రామీణ రహదారులు

నల్లమాడ, ఆగస్టు 11: మండలంలోని గ్రామీణ రహదారులు పరిస్థితి దుర్భరంగా మారింది. రెడ్డిపల్లి ప్రధాన రహదారి, తిప్పయ్యగారిపల్లి నుంచి రెడ్డిపల్లి వెళ్లే రహదారులు పరిస్థితి ఘోరంగా ఉంది. కొద్దిపాటి వర్షానికే రెడ్డిపల్లి ప్రధాన రహదారిపై నీరు నిల్వ ఉండి మడుగును తలపిస్తోంది. ఈ రహదారిపై అవగాహన లేని ద్విచక్రవాహనదారులు వెళితే.. ప్రమాదానికి గురికాక తప్పదు. పెద్ద వాహనాలు వేగంగా వెళ్లినప్పుడు... రోడ్డుపై నిల్వ ఉన్న నీరు రహదారికి ఇరువైపులా ఉన్న ఇళ్లల్లోకి ఎగసిపడుతున్నాయని గ్రామస్థులు వాపోతున్నారు. రహదారికి ఇరువైపుల మురుగు కాలువలు లేకపోవడమే ఇందుకు కారణమని అంటున్నారు. చిన్నపాటి వర్షం వస్తే వారం రోజుల పాటు ఈ సమస్య తాము ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఇక మండలంలోని తిప్పయ్యగారిపల్లి నుంచి రెడ్డిపల్లి వైపు వెళ్లే తార్ రోడ్డు గుంతల మయంగా ఉంది. ఈ రోడ్డులో తిప్పయ్యగారిపల్లి నుంచి ప్రతి పది అడుగులకు ఒక గుంత చొప్పున రెండు కిలోమీటర్ల మేర ఈ దుస్థితి ఉంది. ఈ రోడ్డు అంతా కంకర తేలి ఉండటంతో.. ద్విచక్ర వాహనదారులు జారి పడుతూ పలు ప్రమాదాలకు గురవుతున్నారు. వాహనాలు వెళ్లే సమయంలో కంకర రాళ్లు ఎగిరి పడుతుండటంతో పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అత్యవసర సమయంలో కనీసం 108 రావాలన్నా కష్టంగా ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ రోడ్లకు మరమ్మతులు చేయాలని ఆయా గ్రామస్థులు కోరుతున్నారు.


రెడ్డిపల్లి ప్రధాన రహదారిలో నిల్వ ఉన్ననీరు

కంకర తేలిన తిప్పయ్యగారిపల్లి రోడ్డు



ఘనంగా ఆంజనేయ విగ్రహ ప్రతిష్ఠ


నూతనంగా ప్రతిష్ఠించిన ఆంజనేయస్వామి విగ్రహం

మడకశిరటౌన్, ఆగస్టు 11 : పట్టణంలోని 15వ వార్డు యాదవ కల్యాణ మండపం సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపనను కన్నుల పండువగా నిర్వహించారు. స్వామివారికి ఆదివారం క్షీరాభిషేకం, కుంకుమార్చన, విశేష అలంకరణ, హోమాలు తదితర పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని అనేక మంది భక్తులు తరలివచ్చి స్వామివారికి పూజలు చేశారు. నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. మధ్యాహ్నం అన్నదానం చేపట్టారు. శ్రీరామ నామస్మరణతో ఆప్రాంతం మార్మోగింది. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి పాల్గొని పూజలు చేశారు. అలాగే మాజీ ఎమ్మెల్యే మద్దనకుంట ఈరన్న సాయంత్రం ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు జరిపించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ నరసింహరాజు తదితరులు పాల్గొన్నారు.


ప్రతిష్ఠ కార్యక్రమానికి హాజరైన గుండుమల తిప్పేస్వామి

కురుబవాండ్లపల్లిలో నాగుల ప్రతిష్ఠ


నాగుల ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ పార్థసారథి

పెనుకొండ రూరల్, ఆగస్టు 11 : మండలంలోని కురుబవాండ్లపల్లిలో ఆదివారం నాగులను ప్రతిష్ఠను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రెండు రోజులుగా గ్రామంలో నాగులకట్ట వద్ద వేదపండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి ఆదివారం విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి పాల్గొన్నారు. భక్తులు భక్తిశ్రద్ధలతో నాగులకు ప్రత్యేక పూజలు చేశారు. నాయకులు జీవీపీ నాయుడు, రొద్దం నరసింహులు, రవిశంకర్, కురుబశేఖర్, ఐటీడీపీ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రావుడి ఆంజనేయస్వామి ఉత్సవాలు


పూజలందుకున్న ఆంజనేయస్వామి

అగళి, ఆగస్టు 11 : మండలంలోని రావుడి రావుడి ఆంజనేయ స్వామి దేవాలయంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. వందల మంది భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు భక్తిశ్రద్ధలతో హారతులు తీసుకొచ్చారు. స్వామి సన్నిధిలో ఇటీవల రూ. 50 లక్షలతో కల్యాణ మండపం నిర్మించారు. భక్తులు అధిక సంఖ్యలో విరాళాలు అందజేయడంతో ఇది సాధ్యమైందని గ్రామస్థులు, ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

నాగలూరు చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు


చర్చిలో మాట్లాడుతున్న పాస్టర్ లుకాబాబు

పెనుకొండ రూరల్, ఆగస్టు 11 : మండలంలోని నాగలూరు చర్చిలో తైలాభిషేకం పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించినట్లు పాస్టర్ లుకాబాబు తెలిపారు. చర్చిలో యేసు ప్రత్యేక ప్రార్థనలు చేసి, బైబిల్‌లోని విషయాలను బోధించినట్లు తెలిపారు. అనంతరం క్రైస్తవులు విందు భోజనం చేశారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి ప్రత్యేక పూజలు


అలంకరణలో స్వామివారు

ఆత్మకూరు, ఆగస్టు 11: మండలంలోని పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం మాఘమాస ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహించారు. శ్రావణమాసం మొదటి ఆదివారం కావడంతో జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. స్వామివారికి క్షీరాభిషేకం, పంచామృతాభిషేకం తదితర పూజలు నిర్వహించారు. 108 ద్రవ్యాలతో విశేష అభిషేకాలు చేశారు. అనంతరం స్వామివారికి బంగారు కవచ అలంకరణ, అర్చన, ఆకు పూజ, మహానైవేద్యం సమర్పించారు. భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి అక్కిరెడ్డి, ప్రధాన అర్చకులు రాముస్వామి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి ఒకరి మృతి

మరొకరికి తీవ్రగాయాలు

హిందూపురం అర్బన్, ఆగస్టు 11: ద్విచక్రవాహనం అదుపుతప్పి ఒకరు మృతి చెందగా ఒకరికి తీవ్రగాయాలైన సంఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు హిందూపురం మండలం మణేసముద్రంకు చెందిన అశోక్(20) అతని స్నేహితుడు అనీల్ లు పనిమీద కర్నాటక రాష్ట్రం ముద్దెన హళ్ళికి వెళ్ళి తిరిగి వస్తున్న క్రమంలో ఆంధ్ర బార్డర్ దాటి కొద్ది దూరం రాగానే ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడ్డారు. ఈ ఘటనలో అశోక్‌తు తలకు బలమైన గాయాలు తగిలాయి, అనిల్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు గమనించి కర్నాటక 108 వాహనంకు సమాచారం అందించారు. వారు హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి క్షతగాత్రులను తరలించారు. వైద్యులు పరిశీలించి అశోక్ మృతి చెందినట్లు తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

● ఇద్దరి అరెస్టు ● రూ.1.72 లక్షలు స్వాధీనం

మడకశిర రూరల్, ఆగస్టు 11: మండలంలోని ఎల్లోటి గ్రామం కర్ణాటక సరిహద్దులో జూద కేంద్రంపై పోలీసులు ఆదివారం ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. వారి నుంచి రూ.1.72 లక్షలు నగదు స్వాధీనం చేసుకుని, ఇద్దరిని అరెస్టు చేసినట్లు మడకశిర రూరల్ సీఐ రాజ్‌కుమార్ తెలిపారు. మండలంలోని ఎల్లోటి గ్రామసమీపంలో కర్ణాటక సరిహద్దులో భారీగా పేకాడుతున్నట్లు సమాచారం రావడంతో జిల్లా ఎస్పీ ఆదేశాలు ప్రకారం ఆదివారం సిబ్బందితో వెళ్లి దాడులు నిర్వహించినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.1.72 లక్షలు నగదు, మూడు సెల్‌ఫోన్లు, ఒక మోటార్‌సైకిల్‌ను స్వాధీనం చేసుకుని, ఇద్దరిని అరెస్టుచేసినట్లు తెలిపారు. మరో 14 మంది పరారు అయ్యారనీ, వారిని త్వరలో పట్టుకుంటామని సీఐ తెలిపారు.

ఐదు నెలలుగా మూతపడ్డ హోమియో ఆసుపత్రి

● ఇబ్బందులు పడుతున్న రోగులు



తాళంవేసిన హోమియో ఆసుపత్రి

మడకశిర రూరల్, ఆగస్టు 11: మండలంలోని కల్లుమర్రి గ్రామంలో ఉన్న ప్రభుత్వ హోమియోపతి ఆసుపత్రిలో డాక్టర్ లేక రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల వ్యాప్తంగా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులు కల్లుమర్రి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉన్న హోమియో ఆసుపత్రికి వెళ్లి చికిత్సలు పొందుతున్నారు. ఇక్కడ పని చేస్తున్న డాక్టర్ ఐదేళ్ల కిందట బదిలీపై వెళ్లారు. అప్పటి నుంచి ఈ ఆసుపత్రి ఫార్మసిస్టులతోనే నడుస్తోంది. డాక్టర్ లేకపోయినా ఫార్మసిస్టు ఇచ్చే మందులతోనే రోగులు సంతృప్తిచెందుతున్నారు. అయితే ఎన్నికల ముందు ఇక్కడ పనిచేస్తున్న ఫార్మసిస్టు డిప్యుటేషన్‌పై పరిగి మండలంలోని సేవమందిర్‌కు వెళ్లారు. దీంతో ఐదు నెలలుగా హోమియో ఆసుపత్రి మూతపడింది. హోమియోపతి మందులు వాడేవారు ఎక్కువగా పట్టణవాసులే. విషయం తెలియని చాలామంది రోజూ వ్యయప్రయాసులకోర్చి కల్లుమర్రిలోని ఆసుపత్రికి వెళ్తున్నారు. అయితే అక్కడ ఆసుపత్రి మూతపడి ఉండడంతో నిరాశతో వెనుతిరిగి వస్తున్నారు. మరికొంత మంది హిందూపురం వెళ్లి ప్రైవేట్ ఆసుపత్రులలో మందులు కొనుగోలు చేస్తున్నారు ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి వెంటనే హోమియో ఆసుత్రికి డాక్టర్ ను, ఫార్మసిస్టును నియమించాలని రోగులు, ప్రజలు కోరుతున్నారు.

మడకశిరకు మార్చండి

మండలంలోని కల్లుమర్రి గ్రామంలో ఉన్న హోమియో ఆసుపత్రిని మడకశిరకు మార్చాలని ప్రజలు, రోగులు కోరుతున్నారు. గతంలో మడకశిరలో ఉన్న ఈ ఆసుపత్రికి భవనాలు లేని కారణంగా కల్లుమర్రి గ్రామానికి మార్చారు. హోమియోపతి మందులు వాడేవారు అధికంగా పట్టణవాసులే ఉన్నారు. ఉన్నతాధికారులు పరిశీలించి ఈ ఆసుత్రిని మడకశిరకు తరలించాలని ప్రజలు కోరుతున్నారు

48 గంటల్లో చోరీ కేసు ఛేదింపు

నిందితుడి అరెస్ట్: డీఎస్పీ


పట్టుబడిన కారు, నిందితుడితో డీఎస్పీ శ్రీనివాసులు పోలీసులు

గోరంట్ల, ఆగస్టు 11: మండలంలోని పాలసముద్రం సమీపంలోని కుబేరా హిల్స్‌లో కొరియాన్ రెస్టారెంట్ వద్ద చోరీ అయిన కియ కారు కేసును పోలీసులు 48 గంటల్లో ఛేదించినట్లు పెనుకొండ డీఎస్పీఆర్ల శ్రీనివాసులు తెలిపారు. ఈ కేసుకు సంబంధించి డీఎస్పీ ఆదివారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈనెల 8న రాత్రి కొరియన్ రెస్టారెంట్ వద్ద కారు చోరీ అయినట్లు రెస్టారెంట్ మేనేజర్ శ్రీకాంత్‌నాయక్ ఫిర్యాదు మేరకు గోరంట్ల పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. జిల్లా ఎస్పీ రత్న ఆదేశాలతో పోలీసులు అప్రమత్తమయ్యారు. రామన్నపల్లికి చెందిన వడ్డె రమేష్ కొరియన్ రెస్టారెంట్‌లో 2018నుంచి డ్రైవర్‌గా పనిచేస్తూ... బెంగళూరు, తదితర ప్రాంతాల నుంచి విదేశీయులను తీసుకొచ్చేవాడు. అతడు నాలుగు నెలలక్రితం కొరియన్స్‌కు చెందిన కొన్ని వస్తువులు దొంగలించడంతో విధులనుంచి తొలగించారు. ఈ ప్రాంతంలో పనిచేసిన అనుభవంతో అతడు బంధువు వినోద్‌తో కలిసి పలు నేరాలకు పాల్పడ్డాడు. జూన్ 20న కొరియన్ హోటల్‌లోని రూ.80 వేల విలువ చేసే రెండు ఎల్‌ఈడీ టీవీలు, రెండు ఇన్వర్టర్ యూపీఎస్‌లు, మూడు బ్యాటరీలు చోరీ చేసినట్టు పోలీసులు కేసు నమోదు చేశారు. కియా కారు చోరీతో స్పందించిన పోలీసులు డీఎస్పీ ఆధ్వర్యంలో నిందితుడి కోసం గాలింపు చేపట్టారు. పెనుకొండ సీఐ యుగంధర్, ఎస్‌ఐ రాజేష్, రంగడుయాదవ్, ఎఎస్‌ఐ మద్దిలేటి, పోలీస్ సిబ్బంది బెంగళూరు రహదారిలో శెట్టి పల్లి వద్ద నిందితుడిని అరెస్టు చేసి, పలు వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. కేసులోమరో నిందితుడు వినోద్ పరారీలో ఉండడంతో, పోలీసులు గాలిస్తున్నారు. కేసును ఛేదించడంలో కృషిచేసిన పోలీసులను డీఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో సీఐ శేఖర్, పలువురు పోలీసులున్నారు.

'ప్రజాసేవ కోసమే లయన్స్ క్లబ్'


లయన్స్‌క్లబ్ ఏర్పాటు సందర్భంగా జ్యోతి ప్రజ్వలన దృశ్యం

గోరంట్ల, ఆగస్టు 11: ప్రతి ఒక్కరూ తమ సంపాదనలో కొంత ప్రజాసేవకు ఉపయోగించాలనే ఉద్దేశ్యంతో లయన్స్‌క్లబ్ ఏర్పాటైందని రాయలసీమ 316జె గవర్నర్ నెల్లూరు గౌతమ్ పేర్కొన్నారు. గోరంట్లలో నూతనంగా ఏర్పాటు చేసిన లయన్స్‌క్లబ్‌ను స్థానిక ఓ ప్రైవేటు పాఠశాలలో ఆదివారం గౌతమ్ ప్రారంభించారు. గవర్నర్ గౌతమ్‌ను టీడీపీ నాయకుడు నిమ్మల యువశేఖర్ సన్మానించారు. అనంతరం నూతనంగా ఏర్పాటైన గోరంట్ల లయన్స్‌క్లబ్ కమిటీ సభ్యులకు సర్టిఫికెట్లు ఇచ్చి, సన్మానించారు. కమిటీ అధ్యక్షుడిగా బీకే రాజేష్, ఉపాధ్యక్షులుగా డీకే శ్రీనివాస్, కార్యదర్శిగా డీఏ నాగరాజు ప్రకటించారు. అలాగే కోశాధికారిగా షేక్ దస్తగిరి, అడ్మినిస్ట్రేటర్‌గా శివ ప్రకాష్, కోఆర్డినేటర్ అరవింద్ భీమ్‌శెట్టి, ఛైర్మన్స్‌గా గిరిధర్‌గౌడ్, భక్తవత్సలం, అశ్వత్థ నారాయణతో పాటు ముగ్గురు బోర్డుడైరెక్టర్లు, ముగ్గురు సభ్యులతో కమిటీని ప్రకటించారు. వివిధ ప్రాంతాల లయన్స్‌క్లబ్ ప్రతినిధులు ఇల్లూరి గోపాల క్రిష్ణ, రమేష్‌నాథ్‌రెడ్డి, అడ్వకేట్ గురుప్రసాద్, మహిళ కమిషన్ సభ్యులు రుకియా, జక్కా శ్రీనివాసులు, రవికుమార్‌రెడ్డి, సత్యనారాయణ, డాక్టర్ సురేష్‌బాబు, విరూపాక్షరెడ్డి, సంజీవరెడ్డి, లక్ష్మీనారాయణ, గుత్తి అధ్యక్షుడు శ్రీనివాసులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

నేటి నుంచి పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ తరగతులు: ఎంపీడీఓ

మడకశిర(అమరాపురం), ఆగస్టు 11 : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నుంచి బుధవారం వరకు మూడు రోజులపాటు పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ భాస్కర్ తెలిపారు. ఈ కార్యక్రమాల్లో డ్రైనేజీ వ్యవస్థ, తాగునీరు, సంపద తయారీ కేంద్రాలు, మెరుగైన పారిశుధ్య నిర్వహణ తదితర అంశాలపై శిక్షణ ఇస్తామని తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు, అన్ని పంచాయతీల సర్పంచులు, డిజిటల్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొనాలని ఎంపీడీఓ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

చేనేత కార్మికులను ఆదుకోవాలి

● తోపుడు బండి పై మగ్గంతో నిరసన ర్యాలీ

ధర్మవరం, ఆగస్టు 11: ప్రభుత్వాలు చేనేత కార్మికులకు గతంలో అందించే పథకాలను పునరుద్ధరించి.. ఆదుకోవాలని చేనేత కార్మికులు కోరారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం తోపుడు బండిపై చేనేత మగ్గం ఉంచి కొత్తపేట సర్కిల్‌లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం చేనేత కార్మికుడు చింతా శ్రీనివాసులు మాట్లాడుతూ.. ధర్మవరంలో చేనేత కార్మికులు గతంలో వేలాదిమంది చేనేత వృత్తిపై ఆధారపడి జీవించేవారన్నారు. అయితే రానురాను చేనేత పరిశ్రమ కుదేలైందన్నారు. రాజకీయ నాయకులు, అధికారులు మేల్కొని చేనేతలను ఆదు కోవాలని కోరారు. ఈమధ్యకాలంలో పవర్‌లూమ్స్ యజమానులు కూడా దెబ్బతింటున్నార న్నారు. కావున చేనేత పరిశ్రమకు పూర్వవైభవాన్ని తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు.


తోపుడు బండిపై మగ్గాన్ని ఉంచి ర్యాలీ నిర్వహిస్తున్న చేనేత కార్మికులు

ఘనంగా దుర్గాపూజ


శివాలయంలో దుర్గా పూజ చేస్తున్న వేద పండితులు

మడకశిర రూరల్, ఆగస్టు 11: మండలంలోని ఆమిదాలగొంది గ్రామంలో వీరశైవ లింగాయత్ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మంచిన శివాలయంలో ప్రతిష్ఠ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తు న్నారు. అందులో భాగంగా ఆదివారం ఆలయంలో దుర్గాదేవత పూజ ను ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గంలోని వీరశైవ లింగాయత్‌లు అందరూ పాల్గొని అమ్మవారికి పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు. అలాగే సోమవారం శివాలయంలో ప్రాణ ప్రతిష్ఠ, కుంభాభిషేకం, విమాన గోపుర కలశ స్థాపన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీసభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ బీకే పార్థసార్థి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి, ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, సీడబ్ల్యూసీ సభ్యుడు రఘువీరారెడ్డి, కర్నాటక నుంచి ధర్మస్థళ ధర్మాధికారి వీరేంద్రహెగ్డే, రామకృష్ణ సేవా శ్రమ అధిపతి జపానందస్వామి రానున్నట్లు తెలిపారు.

ఆలయ నిర్మాణానికి పలువురి విరాళం

హిందూపురం/లేపాక్షి, ఆగస్టు 11 : పట్టణంలో నూతనంగా నిర్మించ తలపెట్టిన లక్ష్మీనరసింహస్వామి ఆలయ నిర్మాణానికి టీడీపీ బీసీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బేవనహళ్లి ఆనంద్ రూ.2లక్షల విరాళం ఇచ్చారు. అదేవిధంగా హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి, ఎంపీ నిధుల నుంచి రూ.15లక్షలు ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీసభ్యులు పాల్గొన్నారు. అదేవిధంగా లేపాక్షి మండల టీడీపీ కన్వీనర్ జయప్ప ఆదివారం ఆలయ కమిటీ సభ్యులకు రూ.2,01,116 తనవంతు విరాళంగా అందించారు. ఎక్కడైనా ఆలయాలను నిర్మిస్తున్నా, మరమ్మతులు చేపడుతున్నా తన దృష్టికి తీసుకొస్తే సాయం అందిస్తానన్నారు. విరాళం అందించిన ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న అధ్యక్షుడు

ముగిసిన జిల్లాస్థాయి చెస్ పోటీలు

ధర్మవరం, ఆగస్టు 11 : ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ యూటీఎఫ్ స్వర్ణోత్సవ సంబరాల్లో భాగంగా రెండు రోజులుగా కాకతీయ విద్యానికేతన్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి చెస్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ చెస్ పోటీల్లో మహిళా టీచర్స్ విభాగంలో అమలాపురానికి చెందిన సబిహాభాను, ఎన్‌పీకుంటకు చెందిన సీతారత్నం, ధర్మవరానికి చెందిన దుర్గా, మహేశ్వరి విజేతలుగా నిలిచారు. అలాగే పురుష టీచర్స్ విభాగంలో కొత్తచెరువు మండలం కేశాపురానికి చెందిన శివకృష్ణ, గుడిబండకు చెందిన జయచంద్ర, లేపాక్షికి చెందిన శ్రీనివాసరెడ్డి, సీకేపల్లికి చెందిన లక్ష్మీనారాయణస్వామి విజేతలుగా నిలిచారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి సుధాకర్, ఉపాధ్యక్షుడు జీహెచ్‌బాబు, ఆడిట్ కమిటి సభ్యుడు రామకృష్ణ నాయక్, సీనియర్ నాయకులు నారాయణస్వామి, చెన్నకేశవులు విజేతలకు మెమెంటోలు, బహుమతులు అందజేశారు. ఈ విజేత ఉపాధ్యాయులు సెప్టెంబరులో గుంటూరులో జరిగే రాష్ట్ర స్థాయి యూటీఎఫ్ స్వర్ణోత్సవాల పోటీల్లో పాల్గొనే అర్హత సాధించారని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయ నిర్ణేతలు ఆదిరత్నకర్, కిశోర్‌కుమార్, సోమశేఖర ప్రసాద్, పీడీలు రమేశ్, నాగేంద్ర పాల్గొన్నారు.

రోడ్డుపైనే మేకలు, కుక్కలు

● తరచూ ప్రమాదాలు ● పట్టించుకోని అధికారులు


రోడ్డుపై గుంపుగా ఉన్న మేకలు

మడకశిరటౌన్, ఆగస్టు 11 : మడకశిర పట్టణంలో ప్రధాన రహదారులపై తరచూ గుంపులు గుంపులుగా కుక్కలు, మేకలు, పందులు సంచరిస్తున్నాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుడిబండ మండలం సింగేపల్లికి చెందిన దంపతులు తమ చిన్నారి కుమారుడితో శనివారం సాయంత్రం ద్విచక్ర వాహనంలో వెళుతున్నారు. కుక్కలు అడ్డం రావడంతో కిందపడ్డారు. ఎలాంటి ప్రాణాపాయం జరగక పోవడంతో అందరూ ఊపిరి పీల్చుకొన్నారు. గతంలోనూ ఇలాంటి సంఘటనలు చోటు చేసుకున్నాయి. రోడ్డుపై కుక్కలు, పందులు, మేకలు తదితర మూగజీవాల సంచారాన్ని నియంత్రించాలని పలుమార్లు మున్సిపల్ అధికారులకు వినతులు ఇచ్చినా పట్టించుకోవడం లేదని పట్టణ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలో మొత్తం సిమెంటు రోడ్లు కావడంతో... మూగజీ వాలు అడ్డువచ్చినప్పుడు బ్రేకువేస్తే ద్విచక్రవాహనాల చక్రాలు జారి ప్రమాదాలు సంభవిస్తున్నాయని వాహన చోదకులు వాపోతున్నారు. అనుకోకుండా మూగజీవాలు అడ్డం రావడం పరిపాటిగా మారిందని, వీటిని నియంత్రించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. మూగజీ వాల యజమానులు వాటిని పట్టణంలో వదలకుండా, పచ్చిక బయళ్లలో మేతకు తీసుకెళ్లాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. వాటిని రోడ్డుపైకి వదలకుండా అధికారులు సైతం చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

అసాంఘిక కార్యకలాపాలను అరికడతాం

బాధ్యతలు స్వీకరించిన సీఐలు



బాధ్యతలు స్వీకరిస్తున్న అప్‌గ్రేడ్ సీఐ చంద్రాంజనేయులు
రూరల్ సీఐ జనార్దన్

హిందూపురం, ఆగస్టు 11: అసాంఘిక కార్యకలాపాల అడ్డుకట్టకు అధిక ప్రాధాన్యమిస్తామని నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సీఐలు చంద్రాంజనేయులు, జనార్దన్ పేర్కొన్నారు. అప్‌గ్రేడ్ సీఐగా చంద్రాంజనేయులు, హిందూపురం రూరల్ సీఐగా జనార్దన్ ఆదివారం బాధ్యత లు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఎట్టి పరిస్థితుల్లో నూ శాంతిభద్రతల విషయంలో రాజీపడే ప్రసక్తేలేదన్నారు. బాధ్యతలు చేపట్టిన సీఐలకు సిబ్బంది వివిధ రాజకీయ పార్టీల నాయకులు అభినంద నలు తెలిపారు. సీఐ చంద్రాంజనేయులును టీడీపీ హిందూపురం మం డల నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. మండల కన్వీనర్ అశ్వ త్థనారాయణరెడ్డి, బీసీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బేవనహళ్లి ఆనంద్, సర్పంచ్ మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.


బాధ్యతలు స్వీకరించిన అప్‌గ్రేడ్ సీఐ శేఖర్

గోరంట్ల: పట్టణంలోని అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్ సీఐగా బోయ శేఖర్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. గోంటర్లలో పనిచేస్తున్న సీఐ సుబ్బరాయుడు జిల్లా వీఆర్‌కు వెళ్లగా, అనంతపురం జిల్లా వీఆర్‌లో ఉన్న శేఖర్ ఇక్కడకు నియమితులయ్యారు. బాధ్యత లు స్వీకరించిన సీఐ మాట్లాడుతూ... శాంతిభద్రతల విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని అన్నారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. నూతనసీఐ శేఖర్‌ను పలువురు టీడీపీ నాయకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కొత్తపల్లి నరసింహప్ప, అశ్వత్థరెడ్డి, బాలక్రిష్ణచౌదరి, నరేష్, పచ్చా అశోక్, ఉత్తమరెడ్డి, తిరుపాల్, రాజారెడ్డి, నిమ్మల శ్రీధర్, కక్కల రఘు తదితరులున్నారు.

కృష్ణాష్టమి వేడుకలకు తరలిరండి


కరపత్రాలు విడుదల చేస్తున్న యాదవ సంఘం నాయకులు

హిందూపురం(సోమందేపల్లి), ఆగస్టు 11: పట్టణంలో ఈనెల 26న నిర్వహించే కృష్ణాష్టమి వేడుకలకు భక్తులు పెద్దఎత్తున తరలిరావాలని యాదవ సంఘం నాయకులు కోరారు. వారు ఆదివారం పాతూరులోని కాలప్ప ఆలయం ప్రాంగణంలో సంబంధిత కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేడుకలను పురస్కరించుకుని కృష్ణుడి విగ్రహానికి ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. ఉపన్యాసాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, అన్నదాన కార్యక్రమం ఉంటాయన్నారు. చిన్న పిల్లలను కృష్ణుడి వేషధారణతో తీసుకురావాలని, కోలాటం, చెక్కభజన మధ్య కృష్ణుడి ఉత్సవ విగ్రహం ఊరేగింపు చేపడతామన్నారు. కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు నారాయణస్వామి, శ్రీనివాసులు, నరసింహులు, మహేష్, మాజీ ఎంపీటీసీ ప్రభాకర్, ధనుంజయ, శ్రీనివాసులు, లక్ష్మీకాంత, శ్రీనివాసులు, రమేష్, జితేంద్ర, అంజి, గోపాల్, ఓబులేసు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య రక్షణకు యోగా

పావగడ, ఆగస్టు 11: డబ్బు ఖర్చు పెట్టకుండా యోగా ద్వారా ఆరోగ్యాన్ని ఎంతగానో కాపాడుకోవచ్చని సూరపేని విద్యాసాగర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు విద్యాసాగర్ పేర్కొన్నారు. తాలూకాలోని నాగులమడక గ్రామంలో ఆదివారం వాసవీ చారిటబుల్ ట్రస్ట్, విద్యాసాగర్ ఫౌండేషన్, శంకరకంటి ఆసుపత్రి, హెల్ప్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆరోగ్యాన్ని ఎవరూ ఇవ్వరని దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనపైనే ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో శంకర్ కంటి ఆసుపత్రి వైద్యులు మనోజ్, వైద్యులు జస్మిత్, యమున, ప్రణీత్, విద్యారాణి, మానం శశికిరణ్, తదితరులు పాల్గొనగా 150మందికిపైగా కంటి శస్త్ర చికిత్సలో పాల్గొన్నారు.

అడవి పందుల నుంచి పంటలను కాపాడండి

రైతు సంఘం నాయకుల వినతి


అడవిపందుల దాడిలో నష్టపోయిన పంటను చూపుతున్న రైతు సంఘం నాయకులు

పావగడ, ఆగస్టు 11 : తాలూకాలోని గుండపల్లి బ్యాడనూరు, నలిగానహళ్లి పంచాయతీల్లో వేరుశనగ పంటపై అడవి పందులు దాడి చేసి రైతులకు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పూజారప్ప వాపోయారు. ఆయన ఆదివారం ఆయా పంచాయతీల్లో అడివిపందులు దాడి చేసిన పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పూజారప్ప మాట్లాడుతూ... రైతులు ఎంతో కష్టపడి సాగుచేసిన వేరుశనగ పంట కాయ దశలో ఉందన్నారు. అయితే రాత్రిపూట అడవిపందులు, ఎలుగుబంటు దాడిచేస్తుండటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆయన అన్నారు. అటవీశాఖ, రెవెన్యూ అధికారులు పంటపొలాలను పరిశీలించి రైతులకు నష్టపరిహారం అందించేలా ఉన్నతాధికారులకు నివేదిక పంపాలని ఆయన డిమాండ్ చేశారు.

అడ్‌హక్ కమిటీ ఏకగ్రీవం

పుట్టపర్తి రూరల్, ఆగస్టు 11 : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జిల్లా పంచాయతీ కార్యదర్శుల అడ్‌హక్ కమిటీ అధ్యక్షుడు రామమోహన్ అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శుల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఇందులో జిల్లాపంచాయతీ కార్యదర్శుల అడ్‌హక్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రామమోహన్, ప్రధానకార్యదర్శిగా ఈశ్వ ర్, కోశాధికారిగా జయపాల్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడిగా గోవర్ధన్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా గోపి, గణేష్ రెడ్డి, అసోషియేట్ సెక్రటరీగా రెజ్వానా, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా రాజు, అరుణ, మహిళా సెక్రటరీలుగా త్రివేణి, మహ్మద్ అలీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడు రామమోహన్ మాట్లాడుతూ.. జిల్లాలోని పంచాయతీ కార్యదర్శుల సమస్యలపై సమష్టిగా పోరాడదామన్నారు.


మాట్లాడుతున్న అడ్‌హక్ కమిటీ కోశాధికారి జయపాల్